# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్ 22.04.2025

24 క్యారెట్లు 92,787.00

కిలో వెండి 1,07,987.00

36 °C

సంపుటి:3 | సంచిక:171

www.vishalabharati.com


తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నకిలీ ఉద్యోగుల చొరబాటు కలకల సృష్టిస్తోంది. తాజా వెలుగులోకి వచ్చిన నకిలీ ఉద్యోగుల వ్యవహారం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని తీవ్రంగా కలవరపెడుతోంది. గతంలోనూ సచివాలయంలో భద్రతా లోపాలపై పలు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో.. ఈ తాజా ఘటన అధికారులను మరింత ఆందోళన కలిగిస్తోంది. దీంతో.. సచివాలయం సమగ్ర భద్రతా వ్యవస్థపై ప్రభుత్వం లోతుగా దృష్టి సారించింది. ముఖ్యంగా ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో నిఘా ఏర్పాట్లపై సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) అత్యంత నిశితంగా పరిశీలించింది.

# కట్టుదిట్టం..



- సచివాలయంలో నకిలీ ఉద్యోగుల చొరబాటుపై సర్కారు సీరియస్
- సమగ్ర భద్రతా వ్యవస్థపై ప్రభుత్వం లోతుగా దృష్టి
- ఆరవ అంతస్తులు మరింత పటిష్టంగా భద్రత
- రెండంచెల భద్రత వలయాన్ని మోహరించిన ఎస్పీఎఫ్
- మరో 30 కెమెరాలు ఏర్పాటు చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశాలు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

గతంలో గుర్తు తెలియని వ్యక్తులు సచివాలయంలోకి చొరబడటం, కీలకమైన సమాచారం లీక్ కావడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో.. తాజాగా సీఎం రేవంత్ రెడ్డి తరచూ రాకపోకలు సాగించే కీలకమైన మార్గాల్లో సీసీ కెమెరాలు లేకపోవడం జీఏడీ అధికారుల ఆగ్రహానికి కారణమైంది. భద్రతా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ప్రత్యేక రక్షణ దళం (ఎస్పీఎఫ్) యొక్క నిర్లక్ష్యంపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ప్రస్తుతం సచివాలయంలో 246 సీసీ కెమెరాలు పనిచేస్తుండగా.. భద్రతా లోపాలను పూడ్చేందుకు మరో 30 కెమెరాలు ఏర్పాటు చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ముఖ్యమంత్రి రాకపోకల మార్గాలతో పాటు, అత్యంత కీలకమైన ఆరో అంతస్తులో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని ప్రభుత్వం అత్యున్నత స్థాయిలో నిర్ణయం తీసుకుంది. ఇకపై, సాధారణ ప్రజలు లోపలికి అనుమతించబడే సౌత్ ఈస్ట్ గేటుతో పాటు, అంతర్గత ప్రవేశ ద్వారాల వద్ద కూడా మరింత కఠినమైన, సమగ్రమైన తనిఖీలు నిర్వహించనున్నారు. ప్రస్తుతం సచివాలయంలో ఎస్పీఎఫ్ రెండుఅంచెల భద్రతా వలయాన్ని పర్యవేక్షిస్తున్నప్పటికీ.. నకిలీ ఉద్యోగుల చొరబాటు, గతంలో జరిగిన భద్రతా ఉల్లంఘనల నేపథ్యంలో ఈ భద్రతా చర్యలను మరింత పటిష్టంగా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.ఈ మేరకు త్వరలోనే ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు వెలువడే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి యొక్క భద్రతా విషయంలో ఎలాంటి చిన్నపాటి అలసత్వాన్ని కూడా సహించేది లేదని ప్రభుత్వం స్పష్టమైన సంకేతాలు పంపుతోంది. ఈ పరిణామాలు సచివాలయంలో సమూలమైన భద్రతా

..మిగతా 2 లో



# పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూత

- గత కొన్నేళ్లుగా శ్వాసకోశ సమస్య ఇబ్బందులు
- రోమ్‌లోని ఆసుపత్రిలో రెండు నెలలుగా చికిత్స
- 2013లో కేథలిక్ చర్చికి 266వ పోప్‌గా ఎన్నిక
- అమెరికా ఖండం నుంచి పోప్‌గా నియమితులైన తొలి వ్యక్తిగా రికార్డ్
- బాధితుల్లో ఆశ అనే స్ఫూర్తిని రగిలించిన పోప్ ప్రధాని మోదీ
- విలువైన వారసత్వాన్ని వదిలి వెళ్లిన పోప్ ఖర్గే
- పోప్ ఫ్రాన్సిస్ మృతి మానవాళికి తీరని లోటు. సీఎం రేవంత్ రెడ్డి

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

క్యాథలిక్ మతపెద్ద పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూశారు. ప్రస్తుతం ఆయన వయసు 88 ఏండ్లు. గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పోప్ ఫ్రాన్సిస్.. సోమవారం వాటికన్ సిటీలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. ఈ విషయాన్ని వాటికన్ సిటీ అధికారికంగా ప్రకటించింది. పోప్ మొన్న ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్నట్లు తెలిపింది.పోప్ ఫ్రాన్సిస్ గత కొన్నేళ్లుగా శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది ఫిబ్రవరిలో తీవ్రమైన శ్వాసకోస సమస్యతో ఆయన రోమ్‌లోని ఆసుపత్రిలో చేరారు. దాదాపు రెండు నెలలు అక్కడే చికిత్స తీసుకున్నారు. ఈ క్రమంలో సోమవారం తుది శ్వాస విడిచినట్లు వాటికన్ అధికారులు

..మిగతా 2 లో



# ప్రధాని మోదీతో జేడీవాన్స్ భేటి

- భారత్, అమెరికా సంబంధాల విస్తృత చర్చ
- అమెరికా ఉపాధ్యక్షుడి హోదాలో మొదటిసారిగా భారత్ పర్యటన
- ట్రంప్ టారిఫ్ దూకుడు వేళ పర్యటనకు ప్రాధాన్యం
- వాన్స్ దంపతులకు మోదీ ప్రత్యేక విందు
- నేడు దేశంలోని పలు చారిత్రక ప్రదేశాల సందర్శన

..మిగతా 2 లో



## హైకోర్టులో కేటీఆర్‌కు భారీ ఊరట

- రూ.25 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారంటూ కేటీఆర్ ఆరోపణ
- రేవంత్ రెడ్డిపై నిరాధారమైన ఆరోపణలు చేశారంటూ కాంగ్రెస్ మండిపాటు
- ఆత్రం సుగుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఉట్నూరు పోలీసులు

..మిగతా 3 లో

## సమస్య మీది పరిష్కారం మాది

- ఇబ్రహీంపట్నంలో భూభారతి 2025 అవగాహన సదస్సు
- తప్పులు చేస్తే శిక్షలు తప్పవు
- రెవెన్యూ అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరిక
- ప్రజలు కోరిన భూ భారతి చట్టం మీ చేతుల్లో పెట్టినం
- ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలి
- అందుబాటులోకి 6వేల మంది సర్వేయర్లు
- 10,956 మంది గ్రామ రెవెన్యూ అధికారులు
- దరఖాస్తు ఇస్తే చాలు పైసా లేకుండా సమస్య పరిష్కారం
- ఆధార్ కార్డు మాదిరిగా భూధార్ కార్డు
- ప్రతి రెవెన్యూ అధికారి రైతుల ముంగిట్లోకి వస్తారు



**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

దరఖాస్తు ఇస్తే చాలు పైసా లేకుండా భూభారతిలో భూ సమస్యలు పరిష్కారం చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ధరణిలో సమస్యలకులోనైనా రైతులు,ప్రజలు కోరిన భూ భారతి చట్టాన్ని మీ చేతుల్లో

..మిగతా 2 లో



## పెట్టుబడులు పెట్టండి

- జపాన్ వ్యాపారవేత్తలను ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి
- చారిత్రక స్నేహాన్ని దీర్ఘకాల భాగస్వామ్యంగా మార్చుకుందామని పిలుపు
- భారత్ తరఫున తొలి రాష్ట్రంగా నిలిచిన ఘనతను సొంతం చేసుకున్న తెలంగాణ

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జపాన్ వేదికగా ప్రపంచానికి చాటి చెప్పారు. ఒసాకాలో జరిగిన వరల్డ్ ఎక్స్‌పోలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం పాలుపంచుకుంది. వివిధ రంగాలకు చెందిన వ్యాపార

..మిగతా 2 లో



## రైతు భరోసా త్వరలోనే ఇస్తాం

- సీఎంతో చర్చించి జిల్లాకు వ్యవసాయ కళాశాల
- రైతు మహోత్సవం ప్రారంభోత్సవంలో వ్యవసాయ మంత్రి తుమ్మల
- రూ.లక్ష కోట్ల కాళేశ్వరం నిరుపయోగం నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా రైతుల కోసం పథకాలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

రైతులు ఆదాయం ఉన్న పంటలను సాగు చేయాలని, అన్ని పరిస్థితుల్లోనూ రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన రైతు మహోత్సవాన్ని మంత్రులు ఉత్తమ్ కుమార్, జూపల్లి, ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి,

..మిగతా 3 లో

## బీజేపీకి ప్రజలు తగ్గిన బుద్ధిచెప్పాలి

- రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర
- దేశంలో ఇతర మతాలను కించపరిచే విధంగా వారి విధానాలు
- కనీసం హక్కులను లేకుండా నల్ల చట్టాలు
- పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మిక చట్టాలు
- సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

బీజేపీకి ప్రజలు తగ్గిన బుద్ధిచెప్పాలని, వారు రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర చేస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ విమర్శించారు. హైదరాబాద్ శంషాబాద్ పట్టణంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం

..మిగతా 3 లో



## జార్ఖండ్ లో భారీ ఎన్కౌంటర్

- మావోయిస్ట్ జార్ఖండ్ కీలక నేత ప్రయాగ్ మాంఝీ హతం
- మాంఝీపై కోటి రూపాయల రివార్డ్
- ఎన్కౌంటర్ లో మొత్తం 8 మంది మృతి
- మావోయిస్టుల నుంచి ఎస్ఎల్ఆర్, ఎన్సాస్ లాంటి భారీ ఆయుధాలు స్వాధీనం
- జార్ఖండ్‌లో ఏడాది కాలంలో 13 మంది మావోలు మృతి
- 244 మంది మావోయిస్టుల లొంగుబాటు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కేంద్ర బీజేపీ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా మావోయిస్టులుపై ఆపరేషన్ కాగర్ పేరుతో యుద్ధం చేస్తుంది. తాజాగా జార్ఖండ్ లో భారీ ఎన్కౌంటర్ జరిగింది. తన తలపై కోటి రూపాయల రివార్డ్ ఉన్న మావోయిస్టు టాప్ లీడర్ ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. జార్ఖండ్ లోని బొకారో జిల్లా లాల్‌పానియా ప్రాంతంలోని

..మిగతా 3 లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం,
22.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## కట్టుదిట్టం..

తరువాయి భాగం పునర్వ్యవస్థీకరణకు దారితీసే అవకాశం ఉంది. గతంలోని అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఫిబ్రవరిలోనూ ఒక వ్యక్తి తహసీల్దార్ నకిలీ ఐడీ కార్డుతో సెక్రటేరియట్ లోకి ప్రవేశించి పట్టుబడ్డాడు. అంతకు కొద్ది రోజుల ముందే మరొక వ్యక్తి రెవెన్యూ శాఖ ఉద్యోగిగా నకిలీ ఐడీతో లోపలికి వెళ్లాడు. మరోవైపు...సెక్రటేరియట్ పైభాగంలో డ్రోన్ ఎగురవేస్తున్న ఇద్దరు వ్యక్తులను భద్రతా సిబ్బంది పట్టుకున్నారు. తాజాగా.. ఒక వ్యక్తి తన వ్యక్తిగత వాహనంపై ప్రభుత్వ వాహన స్టిక్కర్‌ను ఉపయోగించి సెక్రటేరియట్ లోకి అక్రమంగా ప్రవేశిస్తూ పట్టుబడ్డాడు. అతనికి సచివాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగి సహాయం చేసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.



# ప్రధాని మోదీతో జేడీవాన్స్ భేటి

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

భారత పర్యటనకు వచ్చిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఢిల్లీ వేదికగా సోమవారం సాయంత్రం ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. ఇరునేతల మధ్య వాణిజ్యం, సుంకాలు, ప్రాంతీయ భద్రతతోపాటు పలు ద్వైపాక్షిక అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం. అమెరికా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జేడీ వాన్స్ భారత్ పర్యటనకు రావడం ఇదే తొలిసారి. ఆయన వెంట భార్య ఉషా వాన్స్, ముగ్గురు పిల్లలతో పాటు ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధులు ఉన్నారు. సోమవారం ఉదయం ఢిల్లీలో దిగిన జేడీ వాన్స్ దంపతులకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్, ఇతర అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వాన్స్ పిల్లలు మీడియా దృష్టిని ఆకర్షించారు. కుమారులు ఇవాన్, వివేక్, కుమార్తె మీరాబెల్ భారతీయ సంప్రదాయ దుస్తుల్లో కన్పించారు. అనంతరం వారు ఢిల్లీలోని అక్షర్‌ధామ్ ఆలయాన్ని సందర్శించారు. భేటీ అనంతరం వాన్స్ దంపతులు, అమెరికా అధికారులకు ప్రధాని మోదీ ప్రత్యేక విందు ఇచ్చారు. ట్రంప్ టారిఫ్ దూకుడు వేళ ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. విందు అనంతరం సోమవారం రాత్రే వాన్స్ దంపతులు జయపురకు వెళ్తారు. అక్కడ విలాసవంతమైన రాంభాగ్ ప్యాలెస్ హోటల్‌లో బస చేస్తారు. మంగళవారం ఉదయం పలు చారిత్రక ప్రదేశాలను సందర్శిస్తారు. అందులో అంబర్ కోట కూడా ఉంది. మధ్యాహ్నం రాజస్థాన్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో వాన్స్ ప్రసంగిస్తారు. ట్రంప్ హయాంలో భారత్, అమెరికా సంబంధాల విస్తృతిపై మాట్లాడతారు. ఆ సమావేశానికి దౌత్యవేత్తలు, విదేశీ పాలసీ నిపుణులు, భారత ప్రభుత్వ అధికారులు, విద్యావేత్తలు హాజరవుతారు. 23వ తేదీ ఉదయం వాన్స్ కుటుంబం ఆగ్రాకు వెళ్లనుంది. అక్కడ తాజ్ మహల్‌ను, భారతీయ కళలకు సంబంధించిన శిల్పాగ్రామ్‌ను సందర్శిస్తారు. అదేరోజు మధ్యాహ్నం తర్వాత మళ్లీ వారు జయపురకు వెళ్తారు. 24వ తేదీన జయపుర నుంచి బయలుదేరి అమెరికా వెళ్తారు.

# పెట్టుబడులు పెట్టండి

తరువాయి భాగం

వేత్తలు, పారిశ్రామికవేత్తలతో విడివిడిగా సమావేశమైంది. వివిధ రంగాల్లో రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను వారితో చర్చించింది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ఒసాకాలో జరుగుతున్న వరల్డ్ ఎక్స్ పోలో దేశంలోనే మొదటి రాష్ట్రంగా తెలంగాణ పాలుపంచుకోవటం గర్వంగా ఉందని అన్నారు. తెలంగాణ, జపాన్‌ల మధ్య ఉన్న చారిత్రక స్నేహాన్ని దీర్ఘకాల భాగస్వామ్యంగా మార్చుకుందామని పిలుపునిచ్చారు. కొత్త ఆవిష్కరణలతో భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనకు కలిసి పనిచేద్దామనే ఆకాంక్షను వ్యక్తం చేశారు.ప్రభుత్వం అనుసరిస్తున్న స్థిరమైన విధానాలు, సులభతర పారిశ్రామిక విధానం, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు తెలంగాణలో ఉన్నాయన్నారు. 'హైదరాబాద్‌కు రండి.. మీ ఉత్పత్తులు తయారు చేయండి.. భారత మార్కెట్ తో పాటు ప్రపంచంలోని వివిధ దేశాలకు ఎగుమతి చేసేందుకు తెలంగాణను గమ్యస్థానంగా ఎంచుకొండి..' అని జపాన్ కంపెనీలను సీఎం తెలంగాణకు ఆహ్వానించారు.తెలంగాణకు జపాన్ మధ్య చక్కటి సంబంధాలున్నాయని, ఒసాకా బేలో సూర్యోదయం లాంటి కొత్త అధ్యాయం తెలంగాణలో ప్రారంభమవుతోందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. తెలంగాణతో పాటు ఒసాకా, ప్రపంచంతో కలిసికట్టుగా అద్భుతమైన భవిష్యత్తును నిర్మిద్దామని పిలుపునిచ్చారు.ఐటీ, బయో టెక్నాలజీ రంగాల్లో తెలంగాణ ఇప్పటికే ప్రత్యేకమైన గుర్తింపు సాధించిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. వీటితో పాటు ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, టెక్స్టైల్స్ రంగాల పరిశ్రమలకు ఉన్న అనుకూలతలను వివరించారు. హైదరాబాద్ లో 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ'ని నిర్మిస్తున్నామని, ఎకో, ఎనర్జీ, స్మార్ట్ మొబిలిటీ, సర్క్యులర్ ఎకానమీపై ఈ సిటీ ఆధారపడుతుందన్నారు. జపాన్‌కు చెందిన మారుబెని కార్పొరేషన్‌తో ఫ్యూచర్ సిటీలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.హైదరాబాద్ చుట్టూ 370 కిలో మీటర్ల రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్), రేడియల్ రోడ్లతో పాటు ఆర్ఆర్ఆర్కు ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) మధ్య ఉన్న జోన్‌లో ఎలక్ట్రిక్ వాహనాలు, ఎనర్జీ స్టోరేజ్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్స్, ఏరోస్పేస్ పరిశ్రమలకు అనువైన వాతావరణం ఉందన్నారు.ఎగుమతులకు వీలుగా సమీప ఓడరేవుతో అనుసంధానించే డ్రై పోర్ట్ ను తెలంగాణలో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మూసీ పునరుజ్జీవనంలో భాగంగా నది పొడవునా 55 కిలో మీటర్ల అర్బన్ గ్రీన్ వే అభివృద్ధి చేసేందుకు టోక్యో, ఒసాకా నగరాలను చూసి ఎంతో నేర్చుకోవాల్సి ఉందని అన్నారు.

**ఒసాకా ఎక్స్‌పోలో పాల్గొన్న తొలి రాష్ట్రం**

ఒసాకా ఎక్స్‌పో ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి నిర్వహిస్తారు. ఈ ప్రతిష్ఠాత్మక వేదికలో పాల్గొనడం ద్వారా తెలంగాణ రాష్ట్రం, భారత్ తరపున తొలి రాష్ట్రంగా నిలిచిన ఘనతను సొంతం చేసుకుంది. ఈ ఎక్స్‌పో వేదిక ద్వారా తెలంగాణ రాష్ట్రం తన అనేక వైవిధ్యభరితమైన ప్రత్యేకతలను సంపన్న సాంస్కృతిక చరిత్రను, వేగంగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక వాతావరణాన్ని, సంప్రదాయ కళల నైపుణ్యాన్ని, అలాగే ఆకర్షణీయమైన పర్యాటక ప్రదేశాలను ప్రపంచ నలుమూలల నుంచి వచ్చే సందర్శకులకు వివరించబోతోంది.

# సమస్య మీది పరిష్కారం మాది

తరువాయి భాగం



పెట్టామన్నారు. ధరణి మాదిరిగా భూభారతిలో తప్పులు చేస్తే శిక్షలు తప్పవని రెవెన్యూ అధికారులను మంత్రి హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన తెలంగాణ భూభారతి (భూమి హక్కుల చట్టం 2025 ) పై నిర్వహించిన అవగాహన సదస్సుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి భూభారతి చట్టంపై అంశాల వారీగా వివరించారు. గత 2020 ధరణి లో లోపాలు ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన భూభారతిలో పొందుపరిచిన అంశాలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. ఈ భూభారతి చట్టాన్ని క్షేత్రస్థాయిలో సమగ్రంగా అమలు చేసే క్రమంలో ఇబ్బందులు కలగకుండా 6000 మంది సర్వేలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ప్రతి రైతు తన భూమి సర్వే మ్యాప్ ను కూడా భూభారతి పట్టాదారు పాసుబుక్కులో పొందుపరచుకునే వెసులుబాటును కల్పిస్తున్నామని అన్నారు. అంతేకాకుండా గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్ల తొలగింపునకు గురైన వీఆర్ఏ వీఆర్వోల వ్యవస్థను సైతం తీసుకురానున్నామన్నారు. అందుకు 10,956 రెవెన్యూ గ్రామాలకు గ్రామ రెవెన్యూ అధికారులు నియమిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో రైతాంగం మండల రెవెన్యూ అధికారులు మొదలుకొని జిల్లా కలెక్టర్ సిసిఎల్ఏ వరకు పోయిన సమస్య పరిష్కారం కానీ పరిస్థితిని కల్పించిందన్నారు నేడు ఈ రైతు అధికారుల దగ్గరికి పోవాల్సిన అవసరం లేదని త్వరలోనే గ్రామ రెవెన్యూ అధికారల ద్వారా అధికారులనే గ్రామాలకు పంపిస్తున్నామని గుర్తు చేశారు. ఎక్కడికక్కడ రైతా భూ సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. దరఖాస్తు చేసుకుంటే చాలు పైసా ఖర్చు లేకుండా రైతుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఆధార్ కార్డు మాదిరిగా భూధార్ కార్డులను అందజేస్తామన్నారు. భూదారి నెంబర్ నొక్కితే తన భూమి వివరాలు పూర్తిగా కళ్ళ ముందు ఉంటాయన్నారు. ఆన్లైన్లో జరుగుతున్న మోసాలను కు చెక్కు పెట్టేందుకు ప్రతి సంవత్సరం డిసెంబర్ లో ఆన్లైన్ రికార్డులలో ప్రింట్ రూపంలో తీసి భద్రపరుస్తామన్నారు. ద్వారా తప్పులు చేసేందుకు అవకాశం లేకుండా ఉంటుందని వివరించారు. ధరణి కారణంగా పరిష్కారానికి నోచుకోని 9లక్షల26వేల సాదా బైనామా దరఖాస్తులను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో సాగులో ఉన్నవారికి కూడా పాస్ బుక్కులు ఇస్తామన్నారు.

మంగళ సూత్రాన్ని అమ్మి కోర్టు ఎక్కాల్సిన సీసీఎల్ ఏ లోని దరఖాస్తులు గ్రామ స్థాయికి వస్తాయని రైతులు అధైర్య పగులు పడొద్దని తెలిపారు. 18 లక్షల ఎక్కరాలు పార్ట్ బిలో పెట్టారనీ, వాటిని కూడా పరిష్కరిస్తామన్నారు. ఆ నలుగురి కోసం గత ప్రభుత్వం 2020 చట్టం తెస్తే, తమ కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టాన్ని రైతన్న కోసం తెచ్చామన్నారు. పింక్ కలర్ వేసుకుని వచ్చినా వారి ఇది కూడా న్యాయమైన సమస్య ఉంటే కూడా భూభారతిలో తారతమ్యాలు లేకుండా పరిష్కరిస్తుందని తెలిపారు. తప్పులు చేసే అధికారులకు శిక్షలై కాకుండా గత ప్రభుత్వంలో ధరణి పేరుతో ప్రభుత్వ అసైన్మెంట్ గౌరవ భూములను కబ్జా చేసిన ప్రతి గజాన్ని వెలికి తీస్తామని పేదలకు ఇళ్ల స్థలాల కోసం పంపిణీ చేస్తామన్నారు. ఈ ప్రాంతంలోని ఇళ్ల స్థలాల సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి పరిష్కరించే కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, ధరణి అధ్యయన కమిటీ చైర్మన్ ఎం కోదండ రెడ్డి, రోడ్లు భవనాల బోనాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మల్రెడ్డి రాంరెడ్డి, ఇబ్రహీంపట్నం, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్లు గురునాథరెడ్డి, చిలుక మధుసూదన్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి, జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి రెవెన్యూ అధికారులు సమితారెడ్డి తదితరులు ఉన్నారు.

## హైదరాబాద్‌లో ఈసిగరెట్ విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

హైదరాబాద్ నగరంలో నిషేధిత ఈసిగరెట్లు (వేప్‌లు) అక్రమంగా విక్రయిస్తున్న ముఠాను తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీన్యాబ్) అధికారులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. ముఖ్యంగా విద్యాసంస్థల సమీపంలో యువత, విద్యార్థులే లక్ష్యంగా ఈ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ ముఠా సభ్యులు నగరంలోని పలు కళాశాలలు, పాఠశాలల వద్ద యువతను ఆకర్షించి వారికి ఈసిగరెట్లు, వేపింగ్ పరికరాలను విక్రయిస్తున్నారు. ఇందుకోసం 'ఎస్ఐడీ' అనే పేరుతో ఒక ప్రత్యేక వాట్సప్ గ్రూప్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ గ్రూప్ ద్వారా సుమారు 500 మందికి పైగా వినియోగదారులకు ఈ నిషేధిత ఉత్పత్తులను సరఫరా చేస్తున్నారని అధికారులు గుర్తించారు.









విశాల భారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం,
22.04.2025
హైదరాబాద్
epaper:vishalabharathi.com
www.vishalabharathi.com
3



## నేడే ఇంటర్ ఫలితాలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది మంది విద్యార్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తోన్న ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల విడుదలకు రంగం సిద్ధం అమైంది. ప్రథమ, ద్వితీయ ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలను నేడు మధ్యాహ్నం 12 గంటలకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క విడుదల చేయనున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరవుతారని అన్నారు. విద్యార్థులు తమ ఫలితాలను tgbie.cgg.gov.in, results.eenadu.net, వెబ్‌సైట్‌లలో తెలుసుకోవచ్చు. గత నెల 5 నుంచి 25వ తేదీ వరకు తెలంగాణలో ఇంటర్ పరీక్షలు జరగ్గా దాదాపు 9.5లక్షల మందికి పైగా విద్యార్థులు రాశారు. ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 22 వరకు ప్రాక్టికల్స్ నిర్వహించారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్ నంబర్‌ను ఎంటర్ చేసి ఫలితాలు పొందొచ్చని తెలిపారు.

# హైకోర్టులో కేటీఆర్‌కు భారీ ఊరట

- రూ.25 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారంటూ కేటీఆర్ ఆరోపణ
- కాంగ్రెస్, రేవంత్ రెడ్డిపై నిరాధారమైన ఆరోపణలు చేశారంటూ కేసు నమోదు
- ఆత్రం సుగుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఉట్నూరు పోలీసులు



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలంగాణ హైకోర్టులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఊరట లభించింది. ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం ఉట్నూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. కాంగ్రెస్ మహిళా నాయకురాలు ఆత్రం సుగుణ ఫిర్యాదు మేరకు 2024 సెప్టెంబర్‌లో ఉట్నూరు పోలీస్ స్టేషన్‌లో ఆయనపై కేసు నమోదైంది. మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.25 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడుతోందని ఉట్నూరులో జరిగిన ఒక సభలో కేటీఆర్ ఆరోపణలు చేశారు. దేశంలో రాబోయే ఎన్నికల నిధుల కోసం మూసీ ప్రాజెక్టును రిజర్వ్ బ్యాంక్‌లా ఉపయోగించుకోవాలని చూస్తోందని ఆరోపించారు. కేటీఆర్ చేసిన ఆరోపణలపై ఆత్రం సుగుణ ఫిర్యాదు చేశారు. తమ పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగేలా కేటీఆర్ వ్యాఖ్యలు చేశారంటూ ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థాయిని తగ్గించేలా నిరాధారమైన ఆరోపణలు చేసిన కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కేసును హైకోర్టు తాజాగా కొట్టివేసింది.

# బీజేపీకి ప్రజలు తగ్గిన బుద్ధిచెప్పాలి

తరువాయి భాగం



రాష్ట్ర మహాసభలు రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మొదటి రోజు భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుల ఆధ్వర్యంలో బహిరంగ సభ స్థానిక ఎంఎంఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ.. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చే కుట్రలో ప్రధాని నరేంద్రమోదీ ఉన్నారని నారాయణ విమర్శించారు. అందులో భాగంగానే అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మిక చట్టాలను రద్దు చేశారని వివరించారు. కార్మికుల హక్కులను కాలరాయడంతో కార్మికులు యాజమాన్యాలు చెప్పిన విధంగా ఉండాలనే చట్టాలు తీసుకువచ్చారని మండిపడ్డారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో అన్ని వర్గాలకు న్యాయం చేయకుండా కేవలం బీజేపీ నాయకులు పెట్టుబడిదారులకు అనుకూలంగా రాజ్యాంగాన్ని మార్చుకోవడం కోసం కృషి చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను అడ్డుకోవడం కోసం సీపీఐ కృషి చేస్తూ అనేక పోరాటాలు చేస్తుందని వివరించారు.

దేశంలో ఇతర మతాలను కించపరిచే విధంగా వారి హక్కులను లేకుండా చేస్తున్న బీజేపీకి ప్రజలు తగ్గిన బుద్ధిచెప్పాలని నారాయణ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి సైతం తెలంగాణను అభివృద్ధి చేయకుండా పట్టుబడుల పేరుతో విదేశాలలో జల్సాలు చేస్తున్నారని ఆరోపించారు. అనేక వనరులు ఉన్న తెలంగాణలో అభివృద్ధి చేయలేని రేవంత్‌రెడ్డి విదేశాలలో పర్యటించి తెలంగాణ ప్రజల సోమ్ముతో సోకులు చేస్తున్నారని విమర్శించారు. పేదలకు న్యాయం జరిగే విధంగా అభివృద్ధి పనులు చేయాలని సలహా ఇచ్చారు.

# రైతు భరోసా త్వరలోనే ఇస్తాం

మొదటిపేజీ తరువాయి

షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, ధన్ పాల్ సూర్యనారాయణతో కలిసి మంత్రి తుమ్మల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు మహోత్సవాన్ని సద్వినియోగం చేసుకోవాలని, శాస్త్రవేత్తల సూచనలకు అనుగుణంగా పంటలను సాగు చేయాలని కోరారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వ సహకారం ఉంటుందని పేర్కొన్నారు. డ్రిప్ వ్యవసాయం చేసే రైతులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. త్వరలోనే రైతు భరోసా అందజేస్తామని, రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక కష్టాలు ఉన్నా రూ.33వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశామని తెలిపారు.

**రూ.లక్ష కోట్ల కాళేశ్వరం నిరుపయోగం**

**నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.లక్ష కోట్ల తో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నిరుపయోగంగా మారిందని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టుకు గత ప్రభుత్వం రూ.1.81 కోట్లు ఖర్చు పెట్టినా ఒక్క ఎకరానికీ నీరివ్వలేదని, ఒకటి రెండు నెలల్లో పనులు ప్రారంబించి నిర్ణీత సమయంలో పూర్తి చేస్తామని అన్నారు. గుత్ప ఎత్తిపోతల పథకం విస్తరణకు నిదులు మంజూరు చేసి పూర్తి చేస్తామని, అవసరమైన చోట్ల చెక్ డ్యాములు నిర్మిస్తామని మంత్రి అన్నారు.

**వడగండ్ల బాధిత రైలుకు కేసీఆర్ పరిహారం ఇవ్వలేదు**

**ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ**

గత పదేళ్ళలో కేసీఆర్ వడగండ్ల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. రాష్ట్ర మంత్రులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. బీఅరెస్ హయాంలో అధికారులు కేసీఆర్ భజన చేశారని, వారు పద్ధతి మార్చుకోవాలని సూచించారు. అధికారుల దొంగమాటలు నమ్మకుండా ,ప్రాణహిత చేవేళ్ళ ప్యాకేజి 21,21 పనులు పూర్తి చేయించాలని మంత్రులకు షబ్బీర్ విజ్ఞప్తి చేశారు.

**ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా రైతుల కోసం పథకాలు జిల్లా ఇన్ చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు**

బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో రూ.8లక్షల కోట్లు అప్పులు చేయగా అధికారంలోకి వచ్చిన తరువాత తమ ప్రభుత్వం రూ.లక్షా 40వేల కోట్ల వడ్డీ చెల్లించిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రాష్ట ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా రైతుల కోసం పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. తమది రైతు ప్రభుత్వమని, రైతులు ఓటు వేస్తేనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాపాలన సాగుతోంది. మళ్ళీ 90 సీట్లకు పైగా గెలుస్తామని అన్నారు. నిజాం సాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల్లో పూడిక తీత పనులు చేపట్టి నీటి నిలువ సామర్థ్యం పెరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూత

తరువాయి భాగం



ప్రకటించారు. పోప్ ఫ్రాన్సిస్ 1936 డిసెంబర్ 17న అర్జెంటీనాలో జన్మించారు. ఆయన అసలు పేరు జార్జ్ మారియో బెర్గోగ్లియో. పోప్ బెనెడిక్ట్ XVI రాజీనామాతో 2013 మార్చి 13న కేథలిక్ చర్చికి 266వ పోప్‌గా ఎన్నికయ్యారు. అమెరికా ఖండం నుంచి పోప్‌గా నియమితులైన తొలి వ్యక్తిగా నిలిచారు.

సాధారణంగా పోప్ అంత్యక్రియలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు. అయితే చాలా క్లిష్టమైన ఆ పద్ధతిలో మార్పులు చేయాలని ఇటీవల దివంగత పోప్ ఫ్రాన్సిస్ సూచించారు. దీని కోసం ఆయన కొన్ని ప్లాన్స్‌ను కూడా అప్రూవ్ చేశారు. సరళతరమైన రీతిలో అంత్యక్రియలు నిర్వహించే ప్రక్రియకు ఫ్రాన్సిస్ ఓకే చెప్పారు. గతంలో పోప్‌లను మూడు అంచెలున్న శవపేటికల్లో ఖననం చేసేవారు. సైప్రస్ చెట్టు, సీసం, సిందూర వృక్షంతో తయారైన శవపేటికను పోప్ పార్థీవదేహాన్ని తరలించేందుకు వినియోగించేవారు. అయితే అలాంటి శవపేటికలకు స్వస్తి పలికారు పోప్ ఫ్రాన్సిస్. చాలా సింపుల్‌గా ఉండే .. చెక్క శవపేటికలో తన పార్థీవదేహాన్ని ఉంచాలని ఇటీవల ఫ్రాన్సిస్ తెలిపారు. జింక్ ఖనిజ పట్టీతో ఆ శవపేటిక ఉండనున్నది.

వాటికన్ సిటీలోని సెయింట్ పీటర్స్ బాసిలికా చర్చిలో ప్రజల సందర్శనార్థం ఎత్తుగా ఉండే కాటాఫల్క్ అనే ప్రదేశంలో సాధారణంగా పోప్ పార్థీవదేహాన్ని ఉంతారు. అయితే ఆ పద్ధతిని రద్దు చేశారు ఫ్రాన్సిస్. చివరి చూపు చూడాలనుకునే వారు.. పోప్ పార్థీవదేహాన్ని శవపేటికలోనే తిలకించే అవకాశం కల్పించారు. ఆ శవపేటిక పై కప్పును తీసి ఉంచనున్నారు. అయితే వాటికన్ కాకుండా మరో ప్రదేశంలో రోమన్ క్యాథలిక్ చర్చి మతపెద్దను ఖననం చేయడం గత శతాబ్ద కాలంలో ఇదే తొలిసారికానున్నది. రోమ్‌లోని సెయింట్ మేరీ మేజర్ బాసిలికా చర్చిలో పోప్ ఫ్రాన్సిస్‌ను ఖననం చేయనున్నారు.

**బాధితుల్లో ఆశ అనే స్ఫూర్తిని రగిలించిన పోప్: మోదీ**

"పోప్ ఫ్రాన్సిస్ మరణం చాలా బాధాకరం. మిలియన్ల మంది కరుణ, మానవత్వం, ఆధ్యాత్మిక ధైర్యానికి ప్రతీకగా గుర్తుండిపోతారు. చిన్న వయసు నుంచే ఆయన క్రీస్తు ఆశయాల కోసం పనిచేశారు. పేదలు, విధి వంచితుల కోసం ఆయన సేవలు చేశారు. బాధితుల్లో ఆయన ఆశ అనే స్ఫూర్తిని రగిలించారు. నేను ఆయనతో భేటీ అయినప్పుడు అన్నివిధాలా, సమ్మిళిత అభివృద్ధి విషయంలో నిబద్ధత నన్ను ప్రభావితం చేసింది. భారత ప్రజలపై ఆయన అభిమానం ఎంతో విలువైంది" అంటూ ప్రధాని మోదీ రాసుకొచ్చారు.

**విలువైన వారసత్వాన్ని వదిలి వెళ్లిన పోప్: ఖర్గే**

"పోప్ ఫ్రాన్సిస్ మరణంతో ప్రపంచం మొత్తం విచారంలో ఉంది. ఆయన శాంతి, సామరస్యాన్ని పెంపొందించడంలో మద్దతు ఇచ్చి అన్ని రకాల వివక్షతను అంతం చేయడం, ఆర్థిక అసమానతలను తగ్గించడం వంటి విషయాలపై గొప్ప ప్రభావాన్ని చూపారు. పోప్ ఫ్రాన్సిస్ నిజంగా ఒక ఐకానిక్ వ్యక్తిత్వం, మానవతావాది, చాలా విలువైన వారసత్వాన్ని వదిలి వెళ్లారు" అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు.

పోప్ ఫ్రాన్సిస్ మరణం ప్రపంచానికి తీరని లోటు. ఆయన కరుణ, ప్రేమకు ప్రతిరూపం. సత్యం కోసం ఎప్పుడూ నిలబడ్డారు. అన్యాయాలపై నిర్భయంగా మాట్లాడారు. పేదలు, అణగారిన వర్గాలపై చాలా శ్రద్ధ చూపించారు. మరింత శాంతియుత, దయామయ ప్రపంచాన్ని కోరుకొనే లక్షల మందికి ఆయనో స్ఫూర్తిదాత"

**- ప్రియాంకా గాంధీ వాద్రా, లోక్‌సభ ఎంపీ**

పోప్ ఫ్రాన్సిస్ మృతి మానవాళికి తీరని లోటు. ఆయన మహోన్నత ఆధ్యాత్మిక వ్యక్తి. తన జీవితాన్ని చర్చి, మానవాళి సేవకు అంకితం చేశారు. సామాజిక న్యాయం కోసం అవిశ్రాంత కృషి చేశారు. ప్రపంచ శాంతి స్థాపకుడిగా పోప్ ఫ్రాన్సిస్ పాత్ర అద్భుతం"

**- తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి**

పేదల పట్ల అంకితభావం, అణగారిన వారిని ఆలింగనం చేసుకోవడం, న్యాయం, శాంతి మతాంతర సంభాషణల కోసం ఆయన వాదించడం వల్ల పోప్కు గౌరవం లభించింది. ఆయన వదిలి వెళ్లిన వారసత్వం మానవత్వంలో పాతుకుపోయిన విశ్వాసం"

**-- స్టాలిన్, తమిళనాడు ముఖ్యమంత్రి**



# జార్ఖండ్ లో భారీ ఎన్కౌంటర్

మొదటిపేజీ తరువాయి

ుగు పర్వత పాదాల వద్ద తాజాగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆయన మృతిచెందాడు. అతనిపై జాతీయ దర్యాప్తు సంస్థ ఇప్పటికే రూ.కోటి రివార్డ్ ప్రకటించింది. అతడే మావోయిస్టు టాప్ లీడర్ ప్రయాగ్ మాంఝీ. ఆయనకు వివేక్, ఫుచన, నాగ మాంఝీ, కరన్, లెతర అని మారు పేర్లు ఉన్నాయి. తాజాగా జరిగిన ఎన్‌కౌంటర్లో మొత్తం ఎనిమిది మంది మావోయిస్టులు మరణించారు. వారిలో అరవింద్ మాంఝీ, రామ్ మాంఝీ అనే మావోయిస్టులు కూడా ఉన్నారు. ఆ ఇద్దరిపై కూడా రూ.10 లక్షల చొప్పున రివార్డులు ఉన్నాయి. ఈ ఎన్‌కౌంటర్ సోమవారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో చోటుచేసుకున్నట్లు స్థానిక పత్రికలు తెలిపాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. కేంద్ర కమిటీ సభ్యుడైన ప్రయాగ్ మాంఝీ ముఖ్యంగా ప్రశాంత్ హిల్స్ కేంద్రంగా తన కార్యకలాపాలను నిర్వహించేవాడు.

ధనాబాద్ జిల్లా తుండీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దల్‌బుధ మాంఝీ స్వగ్రామం. జార్ఖండ్, బీహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలో దాదాపు 100 దాడుల్లో అతడి హస్తం ఉంది. ఒక్క గిరిధి జిల్లాలోనే ఆయనపై 50 కేసులు ఉన్నాయి. తలపై రూ.కోటి రివార్డ్ ఉంది. జార్ఖండ్‌లో అత్యధిక రివార్డ్ ఉన్న రెండో మావోయిస్టు ఇతడే. మాంఝీ కాకుండా మరో నలుగురి పైనే రూ.కోటి రివార్డులు ఉన్నాయి. ఇతడు పరస్నాథ్ ప్రాంతంలోకి ప్రవేశించినట్లు సమాచారం అందడంతో పోలీసులు వేగులను అప్రమత్తం చేశారు. కొన్నాళ్ల క్రితం అతడిని గుర్తించారు. సోమవారం తెల్లవారుజామున సీఆర్‌పీఎఫ్, రాష్ట్ర పోలీసులు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. వీరికి లుగు హిల్స్ వద్ద మావోయిస్టులు ఎదురుపడటంతో ఎన్‌కౌంటర్ జరిగింది. ఆ తర్వాత కొద్దిసేపటికి మావోయిస్టులు అడవుల్లోకి పారిపోయారు. అనంతరం భద్రతా బలగాలు ఘటన ప్రాంతంలో పరిశీలించగా మొత్తం 8 మంది మృతదేహాలు లభ్యమయ్యాయి. ఆ ఎనిమిది మందిలో ప్రయాగ్ కూడా ఉన్నట్లు గుర్తించారు.

ఆపరేషన్ అనంతరం మావోయిస్టుల నుంచి ఎస్ఎల్ఆర్, ఎన్సాస్ లాంటి భారీ ఆయుధాలను స్వాధీనం చేసుకొన్నారు. 209 కోబ్రా బెటాలియన్, జార్ఖండ్ పోలీసులు దీనిలో పాల్గొన్నారు. ఈ ఏడాది జార్ఖండ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లలో మొత్తం 13 మంది మావోలు ప్రాణాలు కోల్పోయారు. 2025 చివరికి రాష్ట్రాన్ని మావో రహిత రాష్ట్రంగా చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందులో భాగంగా 244 మంది మావోయిస్టులను రాష్ట్రంలో అరెస్టు చేశారు. పలు దళాల కమాండర్లతో కలిపి 24 మంది లొంగిపోయారు. కాగా ప్రయాగ్ మాంఝీ భార్య జయా మాంఝీని గత ఏడాది పోలీసులు అరెస్టు చేశారు. ఆమె క్యాన్సర్‌తో బాధపడుతోంది. చికిత్స తీసుకోవడానికి వచ్చిన సమయంలో అప్పుడు ఆమెను అరెస్టు చేశారు. ఆ తర్వాత చికిత్స పొందుతూ ఆమె మరణించారు.



# పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక...!

జహీరాబాద్ విశాల భారతి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియను ప్రత్యేక అధికారులు వేగవంతం చేశారు. సోమవారం కోహీర్ మండలంలోని పిచేర్యాగడి పాత తాండ గ్రామ పంచాయతీలో ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులను గుర్తిస్తున్నామని మండల వ్యవసాయ అధికారి పిచేర్యాగడి పాత తాండ గ్రామ ప్రత్యేక అధికారి నవీన్ కుమార్, పంచాయతీ కార్యదర్శి కె.శ్వేత లు పేర్కొన్నారు. పిచేర్యాగడి పాత తాండలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సమక్షంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఎల్ వన్ లో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హుల లబ్ధిదారులను గుర్తించారు. మే 2వ తేదీన అర్హుల లబ్ధిదారుల పేర్లను పంచాయతీలో ప్రదర్శిస్తారని తెలిపారు. గ్రామ సభలు నిర్వహించి గ్రామాల్లో అర్హులను ప్రకటించునున్నామని తెలిపారు. ఈ సమావేశంలో గ్రామ ప్రత్యేక అధికారి నవీన్ కుమార్, పంచాయతీ కార్యదర్శి కె.శ్వేత, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కోహీర్ మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు రాథోడ్ వినోద్ కుమార్, రామావత్ మంగు, చౌవాన్ మేఘునాథ్, చౌహాన్ శోభా బాయి, రామావత్ సుశీలా బాయి, తాండ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాలు ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారించాలి

**- కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా**

**విశాలభారతి,స్టేట్ బ్యూరో :**

రాష్ట్రాలు తమకు కేటాయించిన ఆరోగ్య నిధులను పూర్తిగా వినియోగించుకోకపోవడంపై కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రాలు ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంపై దృష్టి సారించాలని కోరారు. 17వ సివిల్ సర్వీసెస్ దినోత్సవంలో పాల్గొన్న జేపీ నడ్డా 'వైద్య, ఆరోగ్య రంగానికి తగు నిధులు లేవని, ఉన్న నిధులను తగు విధంగా వాడే సామర్థ్యం లేదని వస్తున్న కథనాలను నేను ఒప్పుకోను. ఇప్పటికే ఇచ్చిన నిధులను ఎలా ఉపయోగించారో తెలిపే యుటిలైజేషన్ సర్టిఫికెట్లు కూడా రాష్ట్రాలు సమర్పించడం లేదు. పరికరాల సేకరణలో జాప్యం కారణంగా కేటాయించిన నిధులు మూడేళ్లుగా ఖర్చు కాకుండా అలానే ఉన్నాయి. నమూనాలు మారాయి. కొత్త వెర్షన్లు వచ్చాయి. కానీ టెండర్ ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదు' అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద హెల్త్ కవరేజ్ కార్యక్రమాన్ని మనం లక్ష్యంగా పెట్టుకున్నాం. దానిని మేము మురికి కాలువలోకి వెళ్లనీయం' అని జేపీ నడ్డా అన్నారు. దేశంలో అన్ని పరిపాలనా స్థాయిల్లో జవాబుదారీతనం, సమన్వయం చాలా అవసరం అని జేపీ నడ్డా అన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం,
22.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## పేటలో గాలివాన భీభత్సం



నారాయణపేట, విశాలభారతి:
జిల్లా కేంద్రంలో సాయంకాలం ఈదురు గాలులు భీభత్సం సృష్టించాయి. పట్టణంలో పలు చోట్ల వర్షం భయంకరంగా పడటంతో పాటు గాలులు విపరీతంగా రావటంతో మెయిన్ రోడ్డు లోని రెండు వీధి దీపాల స్తంభాలు కుప్పకూలిపోయాయి. దీంతో ప్రయాణికులకు చాలా సేపు అంతరాయం కలిగింది. ఒక్కసారిగా భీకర గాలులు రావడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని గ్రామస్థులు కోరారు.



## మణుగూరులో ఏసీబీకి చిక్కిన విలేకరి గోపి, సీఐ సతీష్

- తీవ్ర సంచలనం సృష్టించిన మణుగూరు

మణుగూరు, విశాలభారతి:
ఒక్కసారిగా మణుగూరు పోలీస్ స్టేషన్, ఏసీబీ దాడులతో ఉలిక్కిపడింది, సోమవారం నాడు భద్రాద్రి జిల్లాలోని మణుగూరులో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఓ న్యూస్ ఛానల్ విలేకరి మరియు పోలీసు శాఖకు చెందిన సబ్ ఇన్స్పెక్టర్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. ఏసీబీ విడుదల చేసిన అధికారిక ప్రకటన ప్రకారం మణుగూరు పోలీస్ స్టేషన్ పరిధిలో బీఎన్ఎస్ చట్టంలోని 384(4), 329(3) సెక్షన్ల కింద క్రైం నెం. 150/2025గా కేసు నమోదైంది. ఈ కేసులో మామ, అల్లుళ్లకు సహాయం చేయాలంటే రూ. 4 లక్షల లంచం ఇవ్వాలని మణుగూరు సీఐ సోమ సతీష్ కుమార్ డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ డిమాండ్‌ను అమలు చేయడంలో బిగ్ టీవీ విలేకరి మిట్టపల్లి గోపి మధ్యవర్తిగా వ్యవహరించాడు. లంచం మొత్తాన్ని దశలవారీగా చెల్లించేందుకు ఏర్పాట్లు జరుగుతున్న తరుణంలో, మొదటి విడతగా లక్ష రూపాయల నగదును ఫిర్యాదుదారు గోపికి అప్పగిస్తుండగా, ఏసీబీ అధికారులు ముందస్తుగా వేసిన వ్యూహంలో గోపిని సోమవారం మధ్యాహ్నం 1.50 గంటల ప్రాంతంలో పట్టుకున్నారు. చర్యల సందర్భంగా గోపి వద్ద లభించిన నగదును స్వాధీనం చేసుకున్న ఏసీబీ, అతని వేలిముద్రలను రసాయన పరీక్షలకు పంపింది. గోపి నగదు తీసుకున్నట్టుగా అంగీకరించడంతో పాటు పరీక్షల్లో కూడా అదే తేలిందని అధికారులు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మణుగూరు సీఐ సతీష్ కుమార్‌ను ఏ 1గా, బిగ్ టీవీ విలేకరి మిట్టపల్లి గోపిని ఏ2గా నిర్ధారించిన ఏసీబీ, వీరిద్దరినీ అరెస్ట్ చేసి వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరు పరిచినట్లు ప్రకటించింది. ఈ ఘటనతో స్థానిక పోలీస్ విభాగంలో కలకలం రేగగా, మీడియా వర్గాల్లో కూడా చర్చలకు దారితీసింది. అధికార దుర్వినియోగం మరియు విలేకరి పాత్రపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

## మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

- ప్రిన్సిపల్ డా జె ప్రసన్నకుమారి

గరిడేపల్లి, విశాలభారతి:
27వ తేదీన నిర్వహించనున్నట్లు గడ్డిపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె ప్రసన్న కుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.6వ తరగ తిలో ప్రవేశాలకు సంబంధించి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.7వ తరగతి నుంచి పదో తరగతిలో ప్రవేశాలకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వ రకు పరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు.స్థా నిక మోడల్ స్కూల్లోనే ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న



విద్యార్థులు సోమవారం నుంచి వెబ్సైట్లో హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకోవాలని ప్రసన్న కుమారి తెలిపారు. పరీక్షా కేంద్రానికి అర్ధ గంట ముందు చేరుకోవాలని పేర్కొన్నారు.

## డిఎంహెచ్ఓ అవినీతి అన్యాయాలపై విచారణ జరిపించాలి

నారాయణపేట, విశాలభారతి:
జిల్లా వైద్య అధికారి అవినీతి అక్రమాలపై తక్షణమే విచారణ జరిపి సస్పెండ్ చేయాలని బహుజన సమాజ్ పార్టీ (బి యస్ పి)జిల్లా అధ్యక్షుడు బోదిగెలి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లా లోని అధికార పార్టీ ఎమ్మెల్యే అండదండలతోనే వైద్య అధికారిని విచ్చలవిడిగా అక్రమాలు అవినీతి కి పాల్పడుతూ కింది స్థాయి ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తుంది అని ఆరోపించారు. ఎలాంటి నోటిఫికేషన్ లేకుండానే ఫార్మసిస్ట్ , ఔట్ సోర్సింగ్ నర్సు పోస్టులను కొందరు ఆఫీసు సిబ్బంది సహాయంతో భర్తీ చేస్తూ ప్రభుత్వ సొమ్మును దోపిడి చేస్తుందని మండిపడ్డారు. అక్రమ అవినీతి అధికారులకు ప్రభుత్వ పార్టీ నాయకులు అండగా ఉండటం సిగ్గు చేటు అని అన్నారు. జిల్లాలోని ఒక హెల్త్ సెంటర్ లో ఫార్మసిస్ట్ తోటి ఉద్యోగిని పై



లైంగిక వేధింపులకు గురి చేస్తే సరైన చర్యలు తీసుకోవాల్సింది పోయి, బెదిరించి కేస్ మూసి వేయించి డబ్బులు వసూలు చేసిందని ఆరోపలున్నాయన్నారు. తక్షణమే డి ఎం హెచ్ ఓ పై జిల్లా కలెక్టర్ విచారణ జరిపి సస్పెండ్ చేయవలసిందిగా కోరారు. లేదంటే వైద్య శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ,హెల్త్ డైరెక్టర్ కి పిర్యాదు చేస్తానన్నారు.

## నా గెలుపులో అందరితో పాటు రెడ్డీల పాత్ర కూడా ఉంది

నారాయణపేట, విశాలభారతి:
మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అమర చింత పర్యటనలో భాగంగా విలేకరుల సమావేశంలో ఒక ఫేక్ లెటర్ గురించి ఆయనను ప్రశ్నించగా ఆసక్తికరమైన అంశాన్ని వెల్లడించారు. కొంతమంది నాయకులు పని కట్టుకుని నాకు రెడ్డీల మధ్య దూరం పెంచేందుకు ప్రయత్నిస్తున్నారు,గతంలోనూ ఇలాగే ప్రయత్నం చేశారు కానీ ఫలించలేదు అని తెలిపారు. నాకు ఎమ్మెల్యే టికెట్ రావడానికి అందరితో పాటు రెడ్డీ ల తోడ్పాటు ఎంతో ఉంది,అలాగే నాకు మంత్రి పదవి కూడా ఇస్తాము అని రేవంత్ రెడ్డి గారే చెప్పారు అని అన్నారు. మనిషి జీవితంలో కులం



అనేది కూర లో ఉప్పు లాగ ఉండాలి అంతే గాని అదే ఎక్కువైతే తినలేం, తక్కువైనా తినలేం కదా అనడంతో అందరూ ఘోల్లుమన్నారు.

## మెగా జాబ్ మేళాకు భారీ స్పందన

- విజయవంతంగా జాబ్ మేళా
- విశేషంగా పాల్గొన్న యువతి యువకులు

దేవరుప్పల, విశాలభారతి;
పాలకుర్తి నియోజకవర్గంలోని పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల, తొర్రూరు, రాయపర్తి, పెద్దవంగర మండలాల నుంచి భారీగా తరలివచ్చిన ఉద్యోగార్థులు నియోజకవర్గం నుంచే గాక, జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు నిరుద్యోగులుజాబ్ మేళాలో ఇంటర్వ్యూలు చేసిన ఎం ఎన్ సి లు సహా 100 కంపెనీలు అనేక మందికి ఉద్యోగాలు కల్పించిన కంపెనీలు ఒక్కో కంపెనీ కౌంటర్ వద్దకు వెళ్ళి, ఉద్యోగాల ఎంపికను స్వయంగా పరిశీలించిన ఎర్రబెల్లి. ఉద్యోగార్థులతో ముచ్చటించి, వారి అర్హతలు, అవకాశాలపై చర్చించిన దయాకర్ రావు. ఆయా కంపెనీలకు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపిన రాష్ట్ర మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆయా కంపెనీల ప్రతినిధులు, పార్టీ, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ మరియు బిఆర్ఎస్ నాయకులు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్



ఆధ్వర్యంలో పాలకుర్తిలోని బృందవన్ గార్డెన్ నిర్వహించిన మెగా జాబ్ మేళా విజయవంతంగా ముగిసింది. ఈ జాబ్ మేళాలో మల్టీ నేషనల్ కంపెనీలు సహా మొత్తం 100 వివిధ కంపెనీలు పాల్గొనగా, 5000 మందికి ఉద్యోగావకాశాలు కల్పించడానికి అవకాశాలు ఉండగా, ఆయా ఉద్యోగాల కోసం వేలాదిగా ఉద్యోగార్థులు తరలివచ్చారు. కొడకండ్ల, పాలకుర్తి, దేవరుప్పుల, తొర్రూరు, రాయపర్తి, పెద్దవంగర మండలాల ఉద్యోగార్థులకు ఈ మేళా నిర్వహించగా, ఆయా మండలాల నుంచేగాక, జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వేలాదిగా యువతీ యువకులు తరలి వచ్చి, ఇంటర్వ్యూలలో పాల్గొన్నారు. వాళ్ళందరికీ ఆయా కంపెనీల ప్రతినిధులు ఓపికగా ఇంటర్వ్యూలు చేశారు. వారి అర్హతలు, ఇంటర్వ్యూలను ఎదుర్కొన్న తీరుతెన్నులు, అవకాశాలను బట్టి అనేక మందికి ఈ మేళా ద్వారా ఉద్యోగాలు కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల అధ్యక్షులు పసునూరి నవీన్, తీగల దయాకర్, ఈదురి ఐలయ్య, నర్సింహ నాయక్, మాజీ జడ్పీటీసీలు పస్నూరి శ్రీనివాస్, పల్లా సుందర్ రాం రెడ్డి, మంగళపల్లి శ్రీనివాస్, సుధీర్, మాజీ ఎంపిపిలు నల్లా నాగిరెడ్డి, బస్వ మల్లేష్, మాజీ జిసిసి చైర్మన్ గాంధీ నాయక్, సెక్స్ చైర్మన్ అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా స్పీడ్ బ్రేకర్లు

- ప్రమాదానికి గురై పలువురికి గాయాలు

మణుగూరు, విశాలభారతి:
మండలంలోని సమితి సింగారం పంచాయతీ కార్యాలయం సమీపంలో పీవీ కాలనీ రోడ్డులో రెండు రోజుల క్రితం ఆకస్మికంగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసారు. ప్రమాదాలకు నిలయంగా మారాయని వెంటనే వాటిని తొలగించాలని లేదా ప్రమాదాలకు ఆస్కారం లేకుండా వేగ నిరోధకాలుగా పనిచేసే చిన్న పాటి బ్రేకర్లు ఏర్పాటు చేయాలని మణుగూరు ఏరియా సామాజిక సేవకులు కర్నె బాబురావు అధికారులను కోరారు. సోమవారం ప్రమాదాలకు నిలయంగా మారిన స్పీడ్ బ్రేకర్లను ఆయన సందర్శించారు. సమితి సింగారం పంచాయతీ కార్యాలయం మూలమలుపు వద్ద కాలనీ రోడ్డులో రెండు రోజుల క్రితం నిర్మించిన స్పీడు బ్రేకర్లు



ఎలాంటి హెచ్చరికలు లేకపోవడంతో గమనించగా పలువురు గాయపడ్డారని ఓ కార్మిక నాయకుడు తెల్లవారుజామున కాలనీ ప్రయాణిస్తూ బ్రేకర్లను గమనించక ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురై తలకు గాయం కావడంతో సింగరేణి ఆసుపత్రికి తరలించారని అన్నారు. ప్రస్తుతం సింగరేణి మెయిన్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారని అధికారుల అనాలోచిత నిర్ణయం పలువురు ద్విచక్ర వాహనాలు కిందపడి గాయాల పాలయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



## గౌడ జన హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శిగా మేరుగు మల్లేశం గౌడ్

తొర్రూరు, విశాలభారతి:
మహబూబాబాద్ గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ జిల్లా కార్యదర్శిగా తొర్రూర్ మండలం గుర్తూరు గ్రామానికి చెందిన మేరుగు మల్లేశం గౌడ్ ను నియమించినట్లు మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నియామాక పత్రం మల్లేశం గౌడ్ ఇచ్చినట్లు తెలిపారు. మల్లేశం గౌడ్ గత కొన్నేళ్లుగా గౌడ కులానికి చేస్తున్న సేవలను గుర్తించి కార్యదర్శిగా నియమించినట్లు రమేష్ గౌడ్ తెలిపారు. ఈ నియామకం ప్రకారం రెండు సంవత్సరాలు పదవిలో ఉండనున్నట్లు రమేష్ గౌడ్ వివరించారు. తనను కార్యదర్శి గా నియమించిన మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ కు, తన ఎన్నికకు సహకరించిన మోకు దెబ్బ గౌరవ అధ్యక్షులు సొల్తీ సారయ్య గౌడ్ కు,మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు ముంజాల రాజేందర్ గౌడ్, హన్మకొండ జిల్లా అధ్యక్షులు తోటకూరి రాందాస్ గౌడ్ కు మల్లేశం గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.



## మంత్రి ఉత్తమ్ పర్యటన విజయవంతం చేయాలి

తిరుమలగిరి, విశాలభారతి:
మండలంలోని తాటిపాముల గ్రామానికి మంగళవారం రోజున నీటిపారుదల పౌరసరఫర శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రానున్నారని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ తెలిపారు. సోమవారం నాడు తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంగళ వారం నాడు తాటిపాముల గ్రామానికి దాదాపు 16 కోట్ల రూపాయలతో బ్రిడ్జి శంకుస్థాపన కార్యక్రమానికి,60 లక్షలతో నిర్మించిన సిసి రోడ్ల ప్రారంభోత్సవం, 25 లక్షల సిసి రోడ్లు,500 కుట్టు మిషన్లు పంపిణీ కార్యక్రమానికి హాజరుకానున్నారని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని ఘనస్వాగతం పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి మండల కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఎల్సోజ్ నరేష్ ,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పేరాల వీరేష్ ,కాంగ్రెస్ మండల నాయకులు జిమ్మీలాల్,పి ఎ సి ఎస్ చైర్మన్ పాలపు చంద్రశేఖర్, డానియల్, కిష్టు నాయక్ ,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## సరైన పోషక ఆహారం తీసుకోవాలి

దేవరుప్పల, విశాలభారతి:
మండలం చిన్నమడూరు గ్రామంలో పోషణ పక్షం సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఓ సత్యవతి అధ్యక్షతనలో ఏర్పాటు చేసుకోవడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సరైన పోషక ఆహారం తల్లులు, పిల్లలు తప్పకుండా తీసుకోవాలి, అంగన్వాడి సేవలు ఉపయోగించుకోవాలి, అందుబాటులో ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలి, అంగన్వాడీ కేంద్రానికి ప్రతి రోజు తప్పకుండా గర్భవతులు బాలింతలు వచ్చి సంపూర్ణ భోజనం తీసుకోవాలి, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు గంటలోపు పట్టించాలి, మూడు నెలలు నిండిన తర్వాత అనుబంధ ఆహారము మొదలుపెట్టాలి, మూడు నుండి ఆరు సంవత్సరాల పిల్లలందరూ అంగన్వాడి కేంద్రంకు పంపించాలి అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కళావతి, సూపర్వైజర్ శ్రీదేవి, ఏఎన్ఎం, సఖిటీం, ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ మాధవి, అంగన్వాడి ఉపాధ్యాయులు నర్మదా హైమావతి, లలిత, ఆశాలు, గర్భిణీలు బాలింతలు, తదితరులు, కిషోర్ బాల బాలికలు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం,
22.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





# క్రీడలతోనే మానసిక వికాసం

- తొర్రూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి

**తొర్రూరు, విశాలభారతి:** క్రీడలు మనో వికాసానికి దోహదం చేసి శారీరక దృఢత్వానికి తోడ్పడుతాయని తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతి రెడ్డి అన్నారు. తొర్రూరు కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గత రెండు రోజులుగా కీ.శే అనుమాండ్ల మాధవ రెడ్డి జ్ఞాపకార్థం వారి మనవడైన అనుమాండ్ల తిరుపతి రెడ్డి ఆర్థిక సహకారంతో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఆహ్వానిత వాలీబాల్ క్రీడోత్సవాల బహుమతి ప్రధానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు స్నేహాన్ని పెంపొందిస్తాయని, శారీరక మనో వికాసాన్ని కలిగిస్తాయని, విద్యార్థులందరూ కూడా క్రీడల పైన దృష్టి పెట్టాలని అన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రీడలను పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డిలు ప్రారంభించినట్లు తెలిపారు.ఎంప్లాయిస్ వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు గొడిశాల నగేష్ అధ్యక్షతన ముగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. తిరుపతి రెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతిని రఘునాథపల్లి, ద్వితీయ మేడారం తృతీయ కొత్తగూడ,చతుర్ద బహుమతిని తాడ్వాయి క్రీడాకారులు గెలుచుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రెటరీ వాసిరెడ్డి ప్రవీణ్ రెడ్డి,సూరం ఉపేందర్ రెడ్డి, కొండం జనార్దన్, ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెల్ల లక్ష్మీనారాయణ,వాలీబాల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మర్మాల ఆది రెడ్డి,నరెడ్ల శ్రీధర్,ఎంప్లాయిస్ వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధులు దేవులపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## జలమండలి జనరల్ మేనేజర్ ని కలసిన నవజీవన్ రెడ్డి



**పెద్ద అంబర్ పేట్,విశాలభారతి:** హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి సోమవారం జలమండలి జనరల్ మేనేజర్ శ్రీనివాస్ ని వారి కార్యాలయంలో కలిశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ నవ జీవన్ రెడ్డి డివిజన్ లోని పలు కాలనిలో ఉన్నటువంటి భూగర్భ డ్రైనేజ్ తో పాటు మంచి నీటి సమస్యను వివరించి, వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని మేనేజర్ ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ డివిజన్ బిజెపి నాయకులు, సంబంధిత జలమండలి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సర్వీస్ రోడ్లను త్వరగా పూర్తి చేయాలి



**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ శాఖ అధ్యక్షులు కడారి కల్పనయాదవ్ అధ్యక్షతన చౌటుప్పల పట్టణంలోనిసర్వీస్ రోడ్లను తనిఖీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వీస్ రోడ్డు పనులు సుమారుగా సంవత్సరం కావస్తున్న ఇంతవరకు పనులు పూర్తికాలేదు కావున ప్రజలు మరియు షాపుల యజమానులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ అసౌకర్యానికిగురవుచున్నందున స్థానిక ఆర్డిఓకి వినతిపత్రం ఇచ్చి సర్వీస్ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తేవాలనికోరడంజరిగింది. తదనంతరం స్థానిక బస్టాండ్ లో మరుగుదొడ్లలో నీటి సౌకర్యం లేక మరుగుదొడ్లకుతాళం వేసి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న అధికారులను మందలించాలని నల్గొండ డిపో మేనేజర్కిఫిర్యాదుచేయడం జరిగింది.కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి మహిళలను అగౌరవ పరుస్తున్నారు.కనుక మహిళలు ఆలోచించాలని భారతీయ జనతా పార్టీ కోరుకుంటున్నది.అదేవిధంగా పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్నందునమరియు రోడ్డు పనులు జరుగుతున్నందునట్రాఫిక్ పోలీసు వారు ప్రజలకు చలానాలపేరుతోటి తాట తీస్తున్నారు కనుక స్థానిక ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ భారతీయ జనతా పార్టీ చౌటుప్పల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. స్థానిక ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పార్కింగ్ విషయంలో మరియు హెల్మెట్ విషయంలో మినహాయింపు ఇవ్వాలని కోరడంజరిగింది. ఈ కార్యక్రమంలో మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల బిక్షం గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు రమణ గోని శంకరయ్య, నాయకులుగుజ్జుల సురేందర్ రెడ్డి, కైరం కొండ అశోక్, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, ముత్యాల భూపాల్రెడ్డి,ఉడుగు యాదయ్య గౌడ్, బతులజంగయ్య గౌడ్, ఉడుగు యాదయ్య గౌడ్, తడక సురేఖ, కడారి ఐలయ్య యాదవ్, రాజపేట అశోక్, మిత్రులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం

- త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు

**పినపాక, విశాలభారతి:** మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం పైలట్ ప్రాజెక్టు గా ఎంపికైన భూపాలపట్నం గ్రామాన్ని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి, నాణ్యమైన సిమెంట్, మెటీరియల్స్ వినియోగించి , త్వరగా పూర్తి చేయాలని అధికారులను, లబ్ధిదారులను ఆదేశించారు. అనంతరం లబ్ధిదారులు బొగ్గం సరిత, చల్లా వెంకటరమణ, సనప సడాలు, కుంజా లక్ష్మి, బొగ్గం రమ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలించి, వారి సొంత ఇంటి కల నెరవేరుతుండడం పట్ల అభిప్రాయాన్ని చెప్పమన్నారు. ఓ లబ్ధిదారు సన్న బియ్యం ఇస్తున్నారు, సొంత ఇల్లు ఇస్తున్నారు కదా ఇంత కన్నా మాకు సంతోషం ఏమున్నది సార్ అంటూ ఇల్లు పూర్తి చేసుకున్నాక ఏట కోసి బువ్వ పెడతానని చెప్పడంతో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నవ్వుతూ, సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇల్లు అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని, బేస్మెంట్ వరకు పూర్తి చేసిన లబ్ధిదారుల ఖాతాలో రూ లక్ష జమ అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో పినపాక తహసిల్దార్ అద్దంకి నరేష్, ఎంపిడిఓ సునీల్ కుమార్, ఎంపీఓ వెంకటేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గంగిరెడ్డి వెంకటరెడ్డి, ఉడుముల లక్ష్మారెడ్డి, సూరెడ్డి తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**తిరుమలగిరి, విశాలభారతి:** తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని మాలిపురం గ్రామంలో పద్మశాలీ కుల సభ్యుల సమక్షం లో నూతన కమిటీని ఏకగ్రీవం గా ఎన్నుకోవడం జరిగింది.నూతన అధ్యక్షులు గా మద్దూరి శంకరయ్య,ఉపాధ్యక్షులు గా వంగరి సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా వంగరి సోమయ్య (నర్సయ్య), కార్యదర్శిగా వంగరి ఉపేందర్, కోశాధికారిగా అమృతం రాజు, కార్యవర్గ సభ్యులుగా మంచే అంబదాసు, వంగరి వెంకన్న, ఎనగందుల రవి, వీరబత్తిని మల్లయ్య. గుర్రం సత్యనారాయణ,గౌరవ సలహాదారులుగా వంగరి సత్తయ్య, చిలకమారి యాదగిరి, వెంగలి పాండయ్య, మద్దూరి యాదగిరి ,సోషల్ మీడియా ఇన్చార్జిలుగా వంగరి రాజు, శ్రీనాథ్,ఉమేష్, నరేష్, రమేష్ తదితరులు ఎన్నికైనారు. .ఈ కార్యక్రమంలో పద్మశాలి కుల సభ్యులు వంగరి బ్రహ్మం, మద్దూరి కృష్ణమూర్తి, వంగరి సోమయ్య, పోట్ల బత్తుల శంబయ్య, మద్దూరి వెంకన్న (వకీలు), దుస్సా సోమయ్య, దుస్సా సత్యనారాయణ,వంగరి రాములు, , తదితరులు పాల్గొన్నారు.



# నిరుపేదలకు సిఎంఆర్ఎఫ్ అండ

- కాంగ్రెస్ నేత కాట శ్రీనివాస్ గౌడ్
- లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**పటాన్ చెరు,విశాలభారతి**

ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు అండగా నిలుస్తోందని కాంగ్రెస్ పార్టీ పటాన్ చెరు నియోజకవర్గ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ అన్నారు. పటాన్చెరు నియోజకవర్గం లోని వివిధ ప్రాంతాలకు చెందిన లబ్దిదారులకు మజురైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.9 మంది లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ.4,16,500 విలువైన చెక్కులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



# సిపిఐ తొండ గ్రామ శాఖ నూతన కమిటీ ఎన్నిక

**తిరుమలగిరి, విశాలభారతి:** తొండ గ్రామ సిపిఐ మహాసభ కామ్రేడ్ కనుక అశోక్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ మహాసభ కు ఎల్లంల యాదగిరి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ,తుంగతుర్తి నియోజకవర్గ ఇన్చార్జ్ ఎర్ర జెండా ఎగరవేసి మహాసభను ప్రారంభించారు. గత మూడు సంవత్సరాల గ్రామ శాఖ నిర్వహించిన పోరాట కార్యక్రమాలు శాఖ కార్యదర్శి అశోక్ వివరించారు. తర్వాత చేసిన తీర్మానాన్ని సభ్యులందరూ ఆమోదించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎల్లముల యాదగిరి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రా ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహించాలని అన్నారు. ప్రజలకు విద్య,ఉద్యోగం, వైద్యం తప్పనిసరి చేయాలని, ప్రజా సంక్షేమ పథకాలు అర్హులైన పేద ప్రజలందరికీ మంజూరు చేయాలని అన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. గ్రామ శాఖ నూతన కార్యదర్శిగా తిపిరాల శ్రీకాంత్, సహాయ కార్యదర్శిగా ఎల్లంల కొమురెల్లి , కార్యవర్గ సభ్యులుగా ఎండి ఇక్బాల్, కనుక అశోక్, పోరెళ్ళ వెంకన్న, జంపాల మల్లయ్య, జంపాల శీను తదితరులు పాల్గొన్నారు. ఈ ఎన్నిక, జిల్లా కార్యవర్గ సభ్యులు,తుంగతుర్తి నియోజకవర్గ ఇన్చార్జి ఎల్లంల యాదగిరి, మండల కార్యదర్శి ఎస్ డి ఫయాజ్ మియా ఆధ్వర్యంలో నిర్వహించారు.



# రూ.4 కోట్ల 58 లక్షలతో నూతన రహదారులు

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు,విశాలభారతి** శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరు జంక్షన్, వెలిమల నుండి వెలిమల తాండ, పాటి గ్రామ పరిధిలో 4 కోట్ల 58 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల మున్సిపల్ పాలకవర్గం ప్రతిపాదించిన పనులకు సైతం ఆర్థిక శాఖ ద్వారా అనుమతులు మంజూరు చేయించి త్వరగా పనులు ప్రారంభిస్తామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. హెచ్ఎండిఏ పరిధిలోని చెరువులను సైతం ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పరుస్తున్నామని తెలిపారు. నిర్దేశించిన గడువులోగా అభివృద్ధి పనులను పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోమిరెడ్డి, మాజీ సర్పంచులు లక్ష్మణ్, స్వామి గౌడ్, రాములు యాదవ్, పిఏసిఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, హెచ్ఎండిఏ డిఈ రామకృష్ణ, మాజీ కౌన్సిలర్లు రవీందర్ రెడ్డి, సుచరిత కొమరయ్య, శ్రీశైలం, చిట్టి ఉమేష్, బాబ్జి, శ్రీకాంత్, నర్సింలు, నాగరాజు, సీనియర్ నాయకులు రవీందర్ రెడ్డి, దేవేందర్ యాదవ్, వెంకటరామిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, జంగా రెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.




ప్రజావాణిలో సమస్యలు వింటున్న జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి

# ప్రజావాణిలో సమస్యల వెల్లువ

**శేరిలింగంపల్లి, విశాలభారతి:** శేరిలింగంపల్లి జోన్ వ్యాప్తంగా సోమవారం ప్రజావాణి కార్యక్రమం కొనసాగింది. జోనల్ కార్యాలయం తోపాటు,శేరిలింగంపల్లి,చందానగర్ , యూసఫ్ గూడా,పటాన్చెరువు సర్కిల్లో అధికారులు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.కాగా మొత్తం 27 వినతులు అధికారులకు అందాయి.ఇందులో జోనల్ కార్యాలయంలో 8, శేర్లింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో 11,యూసఫ్ గూడ సర్కిల్ కార్యాలయంలో 5,చందానగర్ సర్కిల్ కార్యాలయంలో 3 చొప్పున వినతులు వచ్చాయి. ఇందులో పట్టణ ప్రణాళిక, పన్ను విభాగం, ఇంజనీరింగ్ కు సంబంధించి సమస్యలను ప్రజలు వినతిపత్రం రూపంలో అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన వినతులపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యంత ప్రాధాన్యతగా భావించి క్షేత్రస్థాయి పరిశీలనలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి తీసుకున్న చర్యలను తిరిగి ప్రజలకు నివేదించాలని జోనల్ కమిషనర్ సూచించారు. జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి ఆయా విభాగాల అధికారులతో కలిసి ప్రజావాణిలో వినతులను స్వీకరించారు.



## సిసి రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్

**ఎల్బీ నగర్,విశాలభారతి:**
సి సి రోడ్డు పనులు నాణ్యత ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలని జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ కోరారు. హస్తినాపురం డివిజన్ రెడ్డి కాలనీలో 15 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హస్తినాపురం డివిజన్ అభివృద్ధి తన లక్ష్యమని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొట్లాది రూపాయలు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కాలనీలో ఎక్కడ సమస్య ఉన్న తన దృష్టికి తెచ్చిన వెంటనే పరిష్కరించనున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల్లో కాలనీవాసులు భాగస్వామ్యులు కావాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. కాలనీ సంక్షేమ సంఘం నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు దేరంగుల కృష్ణ, గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



## కట్టెకోల శ్రీమన్నారాయణ ను పరామర్శించిన పటేల్ రమేష్ రెడ్డి

**సూర్యాపేట, విశాలభారతి:**
సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్టెకోల శ్రీమన్నారాయణ బ్రెయిన్ స్ట్రోక్ తో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం వారిని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ కౌన్సిలర్లు వెలుగు వెంకన్న, తండుశ్రీనివాస్ గౌడ్, వల్దాస్ దేవేందర్ తదితరులు ఉన్నారు.





# ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి ఒక్కరికి న్యాయం

- భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి
- ఇబ్రహీంపట్నంలో భూభారతి 2025 అవగాహన సదస్సు

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**
ఇందిరమ్మ రాజ్యంలో ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇబ్రహీంపట్నంలో భూభారతి 2025 అవగాహన సదస్సులకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ రాష్ట్ర ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. ఆరు గ్యారంటీ లను అమలు చేసి చూపించామన్నారు. ధరణిని కాలగర్భంలో కలిపామన్నారు. భూభారతిని ప్రజల ముంగిట్లో పెట్టామన్నారు. వాటి అమలు చేసే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ధరణి పేరుతో ఇబ్బందు రైతాంగాన్ని ఇబ్బందులకు గురి చేసిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ధరణి బాధలు తొలగించి ప్రజాపాలన ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ధరణి పేరుతో అధికార యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకొని ప్రభుత్వ భూములను కొల్లగొట్టారని వాటిని వెలికి తీయాల్సిన అవసరం ఉందని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అవసరమైతే పేదలకు ఇండ్ల స్థలాల కోసం పంపిణీ చేయాలన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. గ్రామస్థాయిలోనే భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అప్పుడే భూ భారతికి లక్ష్యం నెరవేరుతుందన్నారు. ప్రభుత్వ భూములు పేదల చేతుల్లో, లేక ప్రభుత్వం వద్దనే ఉండాలని, భూ కబ్జాదారులు చేతుల్లో ఉండేందుకు వీల లేదన్నారు. అన్యాక్రాంతమైన భూములను వెలికి తీయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి కార్యకర్త రైతులు రెవెన్యూ అధికారులకు సహకరించి తమ భూ సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలని కోరారు. రైతుల బాగు కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు అవగాహన చేసుకోవాలనీ రైతులను కోరారు. అసైన్డ్ భూములను, ఎండోమెంట్, భూదాన భూములను గత ప్రభుత్వం అన్యాక్రాంతం చేసిందని వాటిని వెలికితీసి పేదలకు పంపిణీ చేయాలని కోరారు. గ్రామాల వారిగా వివరాలు సేకరించాలన్నారు.ఎన్నికల్లో ప్రమాణం చేసిన మాదిరిగా వాటన్నిటిని పరిష్కరిస్తున్నామన్నారు.



## ఏఐటియుసి 4వ మహాసభకు తరలివెళ్లిన అబ్దుల్లాపూర్మెట్ మండల నేతలు

- జెండా ఊపి ప్రారంభించిన సిపిఐ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ ముత్యాల యాదిరెడ్డి

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**
రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం నుండి శంషాబాద్ లో జరిగే ఏఐటియుసి 4వ రాష్ట్ర మహాసభకు అబ్దుల్లాపూర్మెట్ మండల సమితి నేతలు తరలివెళ్లారు. ఈ కార్యక్రమానికి సిపిఐ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ ముత్యాల యాదిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం(ఏఐటీయూసీ) డిఓసి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దాసరి ప్రసాద్ అధ్యక్షతన జరిగే నాలుగో మహాసభ కార్యక్రమానికి బయలుదేరిన కార్మిక సోదరులను అభినందించారు. నిర్మాణరంగంలో పనిచేస్తున్న కార్మికులను సంఘటితం చేస్తూ ఉద్యమాలు చేయడం ద్వారానే కార్మికుల యొక్క సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు, ఈ కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్,ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు అజ్మీర హరి సింగ్ నాయక్,బి ఓ సి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దాసరి ప్రసాద్ ,ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు కేతరాజు నరసింహ,డవుల రాములు, పాండు,బిచ్చు నాయక్, క్రాంతి, రవళి, తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి కుటుంబానికి పాలసీలు అవసరం

- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్
- గ్యార మల్లేష్ కు టాటా లైఫ్ ఇన్సూరెన్స్ సక్సెస్ మీట్ లో ఘన సన్మానం.

**పెద్ద అంబర్ పేట్,విశాలభారతి:**
టాటా లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలు చేపిస్తూ కొన్ని కుటుంబాలకు కొన్ని కోట్ల రూపాయల భరోసా కల్పించి సింగపూర్ క్వాలిఫైయర్ అయినందుకు గాను టాటా లైఫ్ ఇన్సూరెన్స్ సక్సెస్ మీట్ కార్యక్రమంలో భాగంగా గ్యారం మల్లేష్ సీనియర్ లైఫ్ ప్లానర్ కి ఘన సన్మానం చేసిన డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఈ సందర్భంగా గ్యార మల్లేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పాలసీలు తీసుకొని తమ కుటుంబాలకు కొన్ని కోట్ల రూపాయలను, తను చనిపోతనే కాదు బ్రతికి ఉన్నప్పుడు కూడా భరోసా కల్పించాలని కోరారు. కానీ నాకు ఈ టాటా లైఫ్ ఇన్సూరెన్స్ లో అవకాశం కల్పించిన డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కి, కందికంటి విజయ్ కుమార్ కి అదేవిధంగా టాటా టీమ్ మెంబర్స్ అందరికీ ఇంత మంచి అవకాశం కల్పించిన అందుకు గాను కృతజ్ఞతలు తెలియజేశారు.



## బిజెపి బౌద్ధ నగర్ డివిజన్ ముఖ్యనేతల సమావేశం

**సికింద్రాబాద్, విశాలభారతి:**
బిజెపి బౌద్ధ నగర్ డివిజన్ ముఖ్య నాయకుల సమావేశం డివిజన్ బిజెపి అధ్యక్షులు సాయి ప్రసాద్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి బిజెపి మహంకాళి జిల్లా కార్యదర్శి రామ్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డివిజన్ కు సంబంధించిన సంస్థాగత విషయాలు అదేవిధంగా డివిజన్ అన్ని మోర్చాల యొక్క కమిటీలను ఏర్పాటు చేయవలసిందిగా దీనికి సంబంధించి ముఖ్య నాయకుల యొక్క పేర్లను రామిరెడ్డికి అందజేశారు. అందులో పొందపరచిన పేర్లలోని వారిని బిజెపి అన్ని అనుబంధ సంస్థలకు నియమించుకోవడం జరుగుతుందని జిల్లా కార్యదర్శి రామిరెడ్డి వివరించారు. సమావేశంలో నాయకులు మద్దెర్ల శ్యామ్ సుందర్, కొమరయ్య, చైతన్య, సంపత్, కుమార్, ఓంలు, సుధాకర్, జయంత్, లడ్డు, అశోక్, సుబ్బారావు, అమరావతి, సుశీల, శ్యామ్ రాజ్, రూప్ సాయి, వెంకటేష్, సతీష్ నేత, నాగరాజు, దీపక్, సాయినాథ్,నీలేష్. బాలయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.



## భవిష్యత్తు బీఆర్ఎస్ పార్టీదే

- బీఆర్ఎస్ పటాన్ చెరు కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి

**పటాన్ చెరు,విశాలభారతి**
తెలంగాణలో భవిష్యత్తు బీఆర్ఎస్ పార్టీదేనని ఆ పార్టీ పటాన్ చెరు నియోజకవర్గ కోఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి అన్నారు. ఈ నెల 27న వరంగల్ ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ కోసం పటాన్ చెరు నియోజకవరం గుమ్మడిదలలో ఏర్పాటు చేసిన ముఖ కార్యకర్తల సమావేశానికి ఆదర్శ్ రెడ్డి ముక్య అధితిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి అభివృద్ధి, సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడ్డారు. కేసీఆర్ పాలనను ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. వరంగల్ ఎల్కతుర్తిలో నిర్వహించే రజతోత్సవ వేడుకలకు తరలిరావాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలో కాట రాజేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని పార్టీ జెండా ఆవిష్కరించి, వాల్ పోస్టర్



ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గోవర్ధన్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, గుమ్మడిదల మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మాజి సర్పంచులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ డిఈ రఘు,వర్క్ ఇన్స్పెక్టర్

**కీసర,విశాలభారతి :**
నాగారం మున్సిపల్ డిఈ రఘు,వర్క్ ఇన్స్పెక్టర్ లు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు.11 లక్షల రూపాయల రోడ్డు పనులకు 16% కమిషన్ ఇవ్వాలని కాంట్రాక్టర్ నీ డిమాండ్ చేసిన డిఈ రఘు, అతనితో పాటు వర్క్ ఇన్స్పెక్టర్ సురేష్,రాకేష్ లను ఏసీబీ అధికారులు అదుపులో తీసుకున్నారు. మొత్తం లక్ష ముప్పై వేల రూపాయలు అవుతున్నాయని డిఈ రఘు కాంట్రాక్టర్ కి చెప్పాడు. సదరు కాంట్రాక్టర్ రమేష్ మాత్రం అంతా అమౌంట్ ఇచ్చుకో లేనని లక్ష రూపాయలకు బేరం కుదుర్చుకున్నాడు. సోమవారం నాగారం మున్సిపాలిటీలో రమేష్ అనే కాంట్రాక్టర్ వద్ద నుండి ఎట్టకేలకు లక్ష రూపాయలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఏసీబీ అధికారులు.నాగారం మున్సిపల్ కార్యాలయంలో కొనసాగుతున్న ఏసీబీ అధికారుల అలాగే వారి ఇంట్లో కూడా సోదాలు నిర్వహించారు. స్థానిక మాజీ వార్డు మెంబర్ మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్ పదవి కాలం పూర్తి అయిన రోజు నుండి మున్సిపాలిటీ మొత్తం అవినీతికి అడ్డాగా మారిందని జనవరి 27 2025 సంవత్సరం నుండి ఇక్కడ మున్సిపాలిటీ పదవి కాలం పూర్తి అయింది.ఇప్పటికీ అయిన స్పెషల్ ఆఫీసర్ స్పందించి మున్సిపాలిటీ పై దృష్టి పెట్టాలని కోరారు.



## ముల్కనూర్ సొసైటీ రైతుల పిల్లలకు ప్రోత్సాహకాలు

- 2008 నుండి 2024 వరకు 1 కోటి 22 లక్షల 53 వేల 5 వందల స్కాలర్షిప్స్ పంపిణీ

**విశాలభారతి,భీమదేవరపల్లి :**
ములుకనూరు సహకార గ్రామీణ పరపతి మరియు మార్కెటింగ్ సొసైటి లిమిటెడ్ సంఘ సభ్యుల పిల్లలకు ఆదివారం సంఘ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఎంసెట్ 2024 మొదటి సంవత్సరము విద్యార్థిని, విద్యార్థులకు (మెడిసిన్, డెంటల్, ఫార్మాడి - రూ.20,000/, ఇంజనీరింగ్, బీఫార్మసీ, బి.ఎస్.సి అగ్రికల్చర్/హార్టికల్చర్/నర్సింగ్ రూ.15,000/) 112 మందికి రూ.17,30,000/ పంపిణీ చేశారు. విద్యార్థులకు డాక్యూమెంటరీ, పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సంఘ కార్యకలాపాలు గూర్చి అవగాహన కల్పించారు. ఈ ప్రోత్సాహక బహుమతుల పంపిణీ కార్యక్రమాన్ని 2008 లో ప్రారంభించి 2024 వరకు 1355 విద్యార్థిని, విద్యార్థులకు ఇప్పటి వరకు రూ.1,22,53,500 పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమములో సంఘ జనరల్ మేనేజర్ యం. రాంరెడ్డి, సంఘ ఉపాధ్యక్షులు కడారి ఆదాం, సంఘ కార్యవర్గ సభ్యులు కంకల భాగ్య, కూన కనుకయ్య, మారుపాటి జయపాల్ రెడ్డి, అంబాల రాములు, గజ్జి వీరయ్య, బేల కనుకమ్మ, కంది రవిందర్ రెడ్డి, ఈర్ల మూగయ్య, కర్రె మహేందర్, మంద శ్రీనివాస్, చెవ్వల్ల బుచ్చయ్య, గుగ్లోతు బాషు, బొల్లపెల్లి వీరన్న మరియు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఎంఎంఎస్ లో పూర్వ ప్రాథమిక ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం

**విశాలభారతి,ఓయూ:**
ఆంధ్ర మహిళ సభ కాలేజ్ ఆఫ్ టీచర్స్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో పూర్వ ప్రాథమిక ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈఇసిసిఇ మూడు నెలల సర్టిఫికెట్ కోర్సులో టీచర్స్ కి శిక్షణ ఇవ్వనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈఇసిసిఇ సర్టిఫికెట్ కోర్సు ప్రీ ప్రైమరి, ప్రైమరీ విద్యార్థులకు ఏవిధంగా ఎలా బోధించాలో ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో ఈ కోర్సు శిక్షణలో నేర్పింపబడుతుందన్నారు.ఆంధ్రమహిళ సభ మరియు పల్లవి ఎడ్యుకేషన్ మేనేజ్మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 9 బ్యాచ్ లకు శిక్షణ పూర్తిచేసినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 300 మంది శిక్షణ పూర్తి చేసుకొని పల్లవి ఎడ్యుకేషన్ పాఠశాల లో మంచి వేతనాలతో స్థిరపడ్డారని చెప్పారు. డా.బి.ఆర్.అంబేద్కర్ 134వ,జయంతి సందర్భంగా 10వ,బ్యాచ్ వారికి ఈ ఇ సి సి ఇ శిక్షణ ప్రారంభించినట్లు చెప్పారు. ఈ సారి ప్రగతి విద్య నికేతన్ టీచర్స్ కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో అడ్మిషన్స్ తీసుకున్నారని చెప్పారు.ఈ శిక్షణ పొందటానికి ఆసక్తి కలిగి ఉన్నవారు,అడ్మిషన్స్ కొరకు 9989745010, 949094033 నెంబర్స్ సంప్రదించాలని సూచించారు.

## ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



**బాల్కొండ,విశాలభారతి:**
భీమ్‌గల్ మండల కేంద్రానికి చెందిన నస్రీన్ బేగం భర్త అహ్మద్, హార్ట్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ హార్ట్ బైపాస్ సర్జరీ అవసరమై నిమ్స్ హాస్పిటల్ లో చేరారు.స్థానిక నాయకులు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.వారి చికిత్స కొరకు ఆయన రూ.2లక్షల, 25వేల ఎల్ఓసి మంజూరు చేయించారు. సోమ వారం హైదరాబాద్ లోని నివాసంలో బాధితునికి ఆయన ఎల్ఓసి కాపీని అందజేశారు.ఈ సందర్భంగా ఎల్ఓసి మంజూరు చేయించిన ఎమ్మెల్యేకి బాధితుని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.





## యువకుడు దారుణ హత్య

**నాగోల్ , విశాలభారతి:**
ఒక యువకుడిని ముగ్గురు యువకులు దారుణంగా హత్య చేసిన సంఘటన చైతన్య పురి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది స్టేషన్ సిఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం ఓల్డ్ నాగోల్ కు చెందిన పంగ మనోజ్ (24) తండ్రి క్రీ.శే బిక్షపతి, అతని స్నేహితుడు బందరు వంశీ ఇద్దరు కలిసి 20న రాత్రి 1:50 గంటలకు నాగోల్ ఫ్లైఓవర్ యూటర్న్ దగ్గర ఉన్న రాజుగారి బిర్యాని హోటల్ ముందు మెయిన్ రోడ్డు పక్కన మొబైల్ సైకిల్ టిఫిన్ బండి దగ్గర టిఫిన్ చేస్తుండగా గతంలో పంగ మనోజ్ పాత స్నేహితుడైన నాగోల్ జయపురి కాలనీ చెందిన సంజయ్ (27) మరియు అతని స్నేహితుడు మహేష్, మరొక యువకుడు ముగ్గురు కలిసి మనోజ్ పై దాడి చేసి విచక్షణారహితంగా కడుపులో కత్తితో పొడిచి మెడపై నరికి గొంతు కోసి దారుణంగా హత్య చేశారు. అడ్డు తగిలిన వంశీని కూడా గాయపరచాలని వంశి ద్వారా తెలుసుకున్నా పంగ మనోజ్ సోదరుడు పంగ మధు చైతన్యపురి పోలీస్ లకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని హత్య జరిగిన సంఘటన ప్రాంతానికి సీఐ వెంకటేశ్వర్లు పోలీస్ సిబ్బంది చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పంగ మనోజ్ సోదరుడు పంగ మధు ను పోలీసులు విచారించగా మనోజ్ గతంలో తన స్నేహితుడైన సంజయ్ కు మధ్య గొడవ జరిగిందని 2023 సంవత్సరం ఏప్రిల్ మనోజ్ సంజయ్ ని హత్య చేయాలని కత్తితో పొడవుగా గతంలో మనోజ్ పై ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయిందని మధు తెలిపారు. దీని మూలంగా కొన్ని రోజుల క్రితమే పెద్ద మనుషుల ఒప్పందంలో భాగంగా సంజయ్ కి మనోజ్ 3 లక్షల రూపాయలు పరిహారం ఇవ్వాలని అనడంతో సంజయ్ 3 లక్షల రూపాయలు తీసుకుని కాంప్రమైజ్ అయ్యాడని ఇలాంటి సంఘటనలు మళ్ళీ జరగకుండా చూసుకోవాలని చెప్పారు. కానీ సంజయ్ మనసులో పాత విషయాలను గుర్తు చేసుకొని పథకం ప్రకారం సంజయ్ అతని స్నేహితులు ముగ్గురు కలిసి 20న రాత్రి దాడి చేసి దారుణంగా హత్య చేశారని మధు పోలీసులకు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని వాళ్ళని తొందరలోనే అరెస్టు చేస్తామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.





## తెలంగాణ రాష్ట్ర మీ సేవ ఆపరేటర్స్ అసోసియేషన్ ఎన్నిక

- అధ్యక్షులుగా జీవన్ ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ భూర అశ్విన్ గౌడ్

**విశాలభారతి, హైదరాబాద్ :**
తెలంగాణ మీసేవ ఆపరేటర్స్ అసోసియేషన్ యొక్క రాష్ట్ర కార్యావర్గ ఎన్నికలు ఆదివారం షామీర్పేట్ లోనీ బృందావన్ గార్డెన్స్ లో నిర్వహించారు. రాష్ట్రంలోని 28 జిల్లాల నుంచి వచ్చిన మీసేవ సభ్యులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులను అధ్యక్షులుగా జీవన్ ప్రసాద్ ని వర్కింగ్ ప్రెసిడెంట్ గా భూర అశ్విన్ గౌడ్ ని అలాగే ప్రధాన కార్యదర్శిగా కొత్త కిరణ్ కుమార్ ని, కోశాధికారిగా శ్రీకాంత్ లను ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులుగా ఎన్నికైన జీవన్ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో 4800 మీసేవలున్నాయి వాటిలో ఎన్నో సమస్యలున్నాయి ఆ సమస్యలన్నిటిని కూడా అతి తొందరలో రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు చేసి అవన్నీ కూడా పరిష్కారం అయ్యే విధంగా ముందుకు వెళ్తామని పేర్కొన్నారు.అలాగే వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన అశ్విన్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ సమస్యలతో ఉన్న మీసేవ నిర్వాహకుల సమస్యలన్నీ కూడా తీర్చే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేశారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించి నటువంటి భూమేష్, లక్ష్మీనారాయణ, రాఘవేందర్,యాదగిరికి సహకరించి నటువంటి దాస్యపు రాజు, ప్రజ్వల్,అనిల్ మరియు ముఖ్య నాయకులు మాజీ జనరల్ సెక్రటరీ జగన్ గారికి జీవన్ (పెరిడెంట్)మరియు అశ్విన్ (వర్కింగ్ ప్రెసిడెంట్)కృతజ్ఞతలు తెలియజేశారు .



## నిరుపేద రైతు కుటుంబాలకు అండగా సుంకిరెడ్డి

- సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి

**ఆమనగల్లు,విశాలభారతి:**
రైతులకు అపద ఉన్న ఎల్లప్పుడూ అండుబాటులో ఉంటాననిఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి అన్నారు. సోమవారం కల్వకుర్తి నియోజకవర్గం లోపర్యటించారు.ఈ సందర్భంగా ఆమనగల్లు మండలం కొత్తకుంట తండాలో అకాల వర్షంతో కేతావత్ శంకర్ నాయక్ అనే రైతు మేకలు మృతి చెందాయి. దాంతో వారికి రూ.10,000/ ఆర్థిక సహాయాన్ని రాఘువేందర్ రెడ్డి అందజేశారు. అనంతరం పోలేపల్లి గ్రామానికి చెందిన రోడ్డు ప్రమాదంలో సిరిగిరి లాలయ్యకు రెండు కా ళ్ళు కోల్పోయిన విషయం తెలుసుకొని పరామర్శించి రూ.10,000/ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలేపల్లి సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి,ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, యువజన నాయకులు అభినవ్ రెడ్డి, రామకృష్ణ,రవి,శివ,సాయి మరియు కొత్తకుంట తండ కిషన్ నాయక్, మోతి నాయక్,లాలు నాయక్, పత్య నాయక్ లతో తదితరులు పాల్గొన్నారు.





## పశ్చిమ బెంగాల్ దాడులను నిరసిస్తూ ర్యాలీ

**ఆమనగల్లు,విశాలభారతి:**
పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో హిందువులపై జరుగుతున్న దాడి, మారణహోమంను నిరసిస్తూ సోమవారం ఆమనగల్లులో హిందూ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీనిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ కార్యాలయంముందు నిరసన తెలిపి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఆ రాష్ట్రంలో మమత ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రం రెడ్డి, మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు ఎర్రవోలు శ్రీనివాస్, మున్సిపాలిటీ మాజీ చైర్మన్ వైస్ చైర్మన్ రాంపాల్ ,దుర్గయ్య, మాజీ కౌన్సిలర్స్ గౌరటీ నర్సింహా, కృష్ణ యాదవ్, కృష్ణ నాయక్, చిన్నకేశవులు,నాగర్ కర్నూల్ జిల్లా బీజేవైఎం కో కన్వీనర్ రవి రాథోడ్, కల్వకుర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ పద్మప్రశాంత్, మహేష్, ఆనంద్, అంజయ్య, అల్లాజి, మనోహర్, ఉప్పల నరసింహ, నరేష్, రామస్వామి, శ్రీను యాదవ్, శ్రీను, నరేంద్ర రాథోడ్, బాలు నాయక్, జయరాం నాయక్, లండన్ మల్లేష్,గోరటి భరత్, సుభాస్, శివాజీ, నిరంజన్, శంకర్,వెంకటేష్ హిందూ సంఘాలు నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## డ్రగ్స్ పై జేఏసీ, మహిళా సంఘాల పోరుయాత్ర

- యాత్రను ప్రారంభించిన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

**విశాలభారతి,భీమదేవరపల్లి:**
మండలంలోని మాణిక్యాపూర్, గాంధీనగర్, రత్నగిరి, వంగర రంగయ్య పల్లి, గ్రామాలలో జేఏసీ, మహిళా సంఘాలు చేపట్టిన డ్రగ్స్ నిర్మూలనా పోరు యాత్రను ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాణిక్యాపూర్ లో సోమవారం ప్రారంభించారు. ఏప్రిల్ 21 నుండి 5 రోజుల పాటు మండల వ్యాప్తంగా కొనసాగుతుంది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ, డ్రగ్స్ కల్చర్ పట్టణాల నుంచి పల్లెలకు వ్యాపించడం ఆందోళన కలిగించే అంశమని అన్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు బానిసలుగా మారుతున్నారని అన్నారు. డ్రగ్స్ వల్ల నియంత్రణ కోల్పోయి, మంచి, చెడు విచక్షణ కోల్పోతారని అన్నారు. ప్రజలు మేల్కొని డ్రగ్స్ కి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. యువత డ్రగ్స్, ఆన్లైన్ గేమ్స్, బెట్టింగులు లోన్ యాప్ లకు దూరంగా ఉండాలని అన్నారు. అంతకు ముందు ఎస్సై సాయిబాబు మాట్లాడుతూ, డ్రగ్స్ అతి తక్కువ సమయంలో ఎక్కువగా వ్యాపించిందని, యువతలో చైతన్యం తీసుకురావాలని అన్నారు. ముఖ్యంగా హై స్కూల్ విద్యార్థుల నుంచి ఇంటర్ విద్యార్థుల వరకు డ్రగ్స్ కల్చర్ వ్యాపించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కవ్వ లక్ష్మారెడ్డి, డ్యాగల సారయ్య, ముల్కనూర్ ఎస్సై సాయిబాబు, ముక్కెర రాజు, ఏపీఎం దేవానంద్, మాజీ ఎంపిటిసి గోపి శర్మ, ఆనందం, ప్రవీణ్, మురళి, ఏదులాపురం తిరుపతి, చెప్యాల ప్రకాష్, మాట్ల వెంకటస్వామి, బేరే యాదగిరి, గాండ్ల పద్మ, మేకల వీరన్న యాదవ్, బొలిశెట్టి శివయ్య, కేడం లింగమూర్తి, అనుమాండ్ల విద్యాసాగర్, సిడిపిఓ స్వరూప, మహిళా సంఘాల సభ్యులు, వివోలు, వివోఏలు తదితరులు పాల్గొన్నారు.



## ఆర్థిక సహాయం అందజేత

**బాల్కొండ,విశాలభారతి:**
భీమ్‌గల్ మండలం పిప్రి గ్రామనికి చెందిన దుబాయ్ రామన్న ఆలయ కమిటీ సభ్యులు గ్రామంలో నిరుపేదలమైన కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన గూండ్ల పెద్దన్నకు రూ.50 వేలు, గౌండ్ల అయిలేని రాజమానికి రూ.50వేల ఆర్థిక సహాయాన్ని దుబాయ్ రామన్న ఆలయ కమిటీ సభ్యులు దుబాయ్ నుండి పంపించారు.వారికి సోమవారం ఈ సహాయన్ని గ్రామస్తులు అందజేశారు.గ్రామంలో ఏ కార్యక్రమం నిర్వహించిన అన్ని కార్యక్రమాలలో తమ వంతుగా ఆర్థిక సాయం అందిస్తూన్న ఆలయ కమిటీ సభ్యులని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు,గ్రామ ప్రజలు అభినందిస్తున్నారు.



## ఆరోగ్యమే మహాభాగ్యం

- గ్రీన్ క్లబ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ముప్పారపు నరేందర్

**సూర్యాపేట,విశాలభారతి:**
మనం ఆరోగ్యంగా ఉంటేనే పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని గ్రీన్ క్లబ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ముప్పారపు నరేందర్ అన్నారు. సోమవారం కొత్త బస్టాండ్ సమీపంలో మన ఊరి చద్దన్నం అనే ఫుడ్ స్టాల్ ను శివ సాయి పిరమిడ్ ట్రస్ట్ అధ్యక్షులు తోట నాగమణి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొర్రలు, సామలు, అరికలు లాంటి చిరుధాన్యాలతో చేసిన అల్పాహారం తీసుకుంటే రోజంతా ఎంత ఉత్సాహంగా ఒత్తిడి లేకుండా పనిచేసుకోవచ్చని, మనం ఆరోగ్యంగా ఉంటూ మన పర్యావరణాన్ని కూడా కాపాడాలని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.నిర్వాహకులు డాక్టర్. పసల భాస్కర్, క్రాంతి కుమార్ లు మాట్లాడుతూ పర్యావరణం మరియు ఆరోగ్యం కోసం ఇంటి నుండి బాక్సులతో పార్సిల్ కోసం వచ్చే వారికి ప్రత్యేక తగ్గింపు కలదని తెలిపారు. గ్రీన్ క్లబ్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్. తోట కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం,
22.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



మునుగోడు, విశాలభారతి: ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలను ఆదుకుంటుందని నల్లగొండ యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మేకల ప్రమోద్ రెడ్డి అన్నారు. ఎలగల గూడెం గ్రామానికి చెందిన డొంకలి లింగస్వామి కి సోమవారం 16, వేల రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును నల్లగొండ యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మేకల ప్రమోద్ రెడ్డి అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల వైద్యానికి అయ్యే ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేసి ఆదుకుంటున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తీర్పారి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు



## శ్రీస్వామినారాయణా గురుకుల్ ఇంటర్నేషనల్ స్కూల్ ని సీజ్ చేయాలి

- పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షులు పూల్లూరి సింహాద్రి

సూర్యాపేట,విశాలభారతి: సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలోని దురాజ్ పల్లి వద్ద ఉన్నటువంటి శ్రీ స్వామి నారాయణ గురుకుల్ ఇంటర్నేషనల్ స్కూల్ ని సీజ్ చేయాలని, ముందస్తు అడ్మిషన్ చేస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ స్కూల్ పర్మిషన్ ను రద్దు చేయాలని పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో సూర్యాపేట చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షులు పూల్లూరి సింహాద్రి మాట్లాడుతూ.. ఎటువంటి అనుమతులు లేకుండా అకస్మాత్తుగా జిల్లా వ్యాప్తంగా శ్రీస్వామినారాయణా గురుకుల్ ఇంటర్నేషనల్ స్కూల్ బోర్డ్ లు వెలిశాయని, పట్టణంలో, గ్రామాలలో తిరుగుతూ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని అన్నారు. అనుమతులు లేకుండా అడ్మిషన్లు నిర్వహిస్తూ ఎటువంటి అకామిడేషన్ చూపించకుండా బ్రోచర్లో ఫీజులను మెన్షన్ చేయకుండా తల్లిదండ్రుల దగ్గర వాళ్ళ అమాయకత్వం ఆసరా చేసుకొని లక్ష నుంచి లక్షన్నర వరకు ఫీజు ఉందని చెప్పి ముందుగా వేల రూపాయలు కట్టి స్లాట్ బుక్ చేసుకోవాలని ప్రచారానికి దిగారని తెలిపారు. ఇంత యధేచ్ఛగా అడ్మిషన్లు జరుగుతున్నప్పటికీ సంబంధిత విద్యాశాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఎలాంటి అనుమతులు లేకుండా ముందస్తుగా కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల అడ్మిషన్స్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంబంధిత అధికారులు కనీసం తనిఖీలు చేయడం దుర్మార్గం అన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు ఇచ్చే ముడుపులు తీసుకొని అనుమతులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి అనుమతి లేకుండా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న విద్యాసంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో అధిక ఫీజులు వసూలు చేసే విద్యా సమస్యలపై ప్రత్యేక ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు నాయకులు, మహేష్,నవీన్, వినయ్, శ్రీధర్,పవన్ మహేష్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.





## సభ పేరుతో కాలువలు వాగులు,ధ్వంసం చేస్తే సహించం

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు

విశాల భారతి,ఎల్కతుర్తి: బిఆర్ఎస్ రజతోత్సవ సభ పేరుతో రైతులకు నీరు అందించే వాగులను కాలువలను ధ్వంసం చేస్తే సహించేది లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు వర్ధన్నపేట ఎమ్మెల్యే కే. ఆర్ నాగరాజు ఎల్కతుర్తి మండల కేంద్రంలోని సోమవారం రోజున కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇచ్చిన సమాచారం మేరకు రజతోత్సవ సభ పేరుతో కాలువలు వాగులను ధ్వంసం చేసి పూడ్చివేత చేసిన వాటిని కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలన చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హసన్ పర్తి మండలం అనంతసాగర్ శివారులోని మాటు వాగుకు సంబంధించిన కాలువలో రాత్రికి రాత్రే ఎటువంటి అనుమతులు లేకుండా పెద్ద ఎత్తున లారీలతో మట్టిని తీసుకు వెళుతున్న బిఆర్ఎస్ నాయకులు పై మండిపడ్డారు రజతోత్సవ సభ రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే ప్రజల వాహనాల పార్కింగ్ సౌకర్యం కోసం దేవాదుల కాలువకు సంబంధించిన పిల్ల కాలువలను మట్టితో పూడ్చడం సరికాదని అన్నారు ఇంత జరుగుతున్న చూసి చూడనట్లుగా వ్యవహరించిన అధికారుల తీరుపై చరవాణిలో మండిపడ్డారు కాలువలు వాగుల ధ్వంసంపై విచారణ చేసి నివేదిక అందించాలని అధికారులకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో టి పి సి సి సభ్యులు బొమ్మనపల్లి అశోక్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి మాజీ మండల అధ్యక్షుడు సంతాజీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొల్లెపోగు రమేష్ బాబు, సింగిల్ విండో మాజీ చైర్మన్ గోలి రాజేశ్వరరావు,మాజీ సర్పంచ్ గొడిశాల యాదగిరి గౌడ్, యూత్ మండల అధ్యక్షులు అంబాల శ్రీకాంత్ (బక్కి.) కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హింగే శ్రీకాంత్, గోడిశాల అర్జున్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాక రమేష్,గూడెల్లి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ అంతరాయం కలిగించద్దు

- రోడ్లు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించవద్దు.
- వాహనదారులు రోడ్లపై అడ్డగోలుగా వాహనాలు నిలపవద్దు.
- ట్రాఫిక్ నియంత్రణకు నిరంతర తనిఖీలు చేస్తూ ఎన్ఫోర్స్మెంట్ చేస్తున్నాం.
- కె. నరసింహ ఐపిఎస్ ఎస్పి సూర్యాపేట జిల్లా.



సూర్యాపేట,విశాలభారతి: ప్రజల అవసరాల దృష్ట్యా జిల్లాలోని పలు పట్టణాల్లో రోజురోజుకీ వాహనాల రద్దీ పెరుగుతుందని, రద్దీ కి అనుగుణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ట్రాఫిక్ అంతరాయం నిరోధించడానికి పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు పునరుద్ధరణ చర్యలు తీసుకుంటూ పోలీసులు కృషి చేస్తున్నారని, నిత్యం వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ ఎన్ఫోర్స్మెంట్ చేస్తున్నామని, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు వాహనదారులకు, వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నారని, ప్రజలు, వాహనదారులు, వీధి వ్యాపారులు పోలీస్ లకు సహకరించాలని జిల్లా ఎస్పి కె.నరసింహ ఐపిఎస్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ట్రాఫిక్ నియంత్రణ పునరుద్ధరణ కోసం పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటున్నా.. పట్టణాల్లోని ముఖ్యమైన కూడళ్లు, జంక్షన్ ల వద్ద, వాణిజ్య ప్రాంతాల్లో వాహనదారులు అడ్డగోలుగా వాహనాలు నిలపడం, వీధి వ్యాపారులు రోడ్లపైకి వచ్చి వ్యాపారాలు నిర్వహించడం వల్ల రద్దీ పెరుగుతూ ట్రాఫిక్ పెరిగి సమస్యలు వస్తున్నాయ అన్నారు. సామాన్య ప్రజలు వీటివల్ల ఇబ్బందులు పడుతున్నారని, పట్టణ రోడ్లపై వాహనాలు నడిపేటప్పుడు వాహనదారులు ముందు వెనక గమనించాలని, ఇండికేటర్స్ ను సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. శబ్ద కాలుష్యం చేస్తూ వేగంగా వాహనాలు నడపవద్దని తెలిపారు. షాపింగ్స్ చేసే సమయంలో ప్రజలు సర్దుబాటు చేసుకుని వాహనాలు ఇతరులకు ఇబ్బంది కలగకుండా పార్కింగ్ చేసుకోవాలి అని సూచించారు. దుకాణాలు నిర్వహించు వారు వస్తువులను రోడ్ల మధ్యవరకు పెట్టడం వల్ల వచ్చిపోయే వాహనాలకు, ప్రజలకు ఇబ్బందులు ఎదురౌతాయ అన్నారు. దుకాణాలు ముందు అడ్డగోలుగా వాహనాలు నిలిపితే దుకాణ యజమానులపై చర్యలు తీసుకుంటాం అన్నారు.దుకాణంలో ఉండే వస్తువులు, తోపుడు బండ్లు, వీధి వ్యాపారులు రోడ్లపై మధ్యలోకి వచ్చేలా వ్యాపారాలు చేయవద్దని కోరారు. పోలీస్ సూచనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

- బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి కృష్ణ



మునుగోడు, విశాలభారతి: తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కృష్ణ కోరారు సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన మాట తప్పకుండా నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు గత ప్రభుత్వం పది సంవత్సరాలు అధికారంలో ఉన్నఉద్యమకారులను పట్టించుకోలేదు గౌరవించే లేదు ఎన్నో అవమానాలు పడ్డారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 250 గజాల ఇంటి స్థలం ఇస్తానని చెప్పి ఇంతవరకు అమలు చేయలేదు వెంటనే ఉద్యమకారులకు ప్రభుత్వం చెప్పిన విధంగా అమలు చేయాలని వారి డిమాండ్ చేశారు అదేవిధంగా ఉద్యమకారుల కుటుంబాలకు కేసుల పాలై ఎంతో ఇబ్బందుల గురయ్యారు. వాళ్లకు తెలంగాణ ఉద్యమకారుల కు గౌరవేతనంగా ప్రతినెల 20వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



## ప్రజావాణి కార్యక్రమానికి 93 దరఖాస్తులు

- రాష్ట్ర ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి
- జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు

సూర్యాపేట, విశాలభారతి: సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో అన్ని శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని దరఖాస్తుల స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం కొరకు అధికారులు ప్రత్యేక దృష్టి కేటాయించాలని తెలిపారు. వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు .సోమవారం జరిగిన ప్రజావాణిలో మొత్తం 93 దరఖాస్తులు అందజేశారని,వీటిలో ఎక్కువగా భూ సమస్యలపై తాసిల్దారులకు వచ్చిన దరఖాస్తులు 38 ఉన్నాయని తెలిపారు. రాష్ట్రస్థాయిలో జరిగే ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను వాటి వివరాలను శాఖల వారీగా అదనపు కలెక్టర్ చదివి వినిపించారు. వెంటనే అధికారులు తగు చర్యలు తీసుకొని పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం (బ్రౌస్) భారతి రంగా ఆర్గనైజేషన్ ఫర్ వెల్ఫేర్ సొసైటీ వారు జిల్లాలోని 700 మంది టీబి పేషెంట్లకు న్యూట్రిషన్ ఫుడ్ 3,000 ప్యాకెట్లు జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు చేతుల మీదుగా టీబి వ్యాధిగ్రస్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీసీఈఓ వి.వి అప్పారావు, బిఎఫ్ సతీష్ కుమార్, డిఎం అండ్ హెచ్ ఓ కోటాచలం, డిడబ్ల్యూ నరసింహారావు, సి పి ఓ ఎల్ కిషన్, డి జి డి వో శంకర్, ఎస్సీ అభివృద్ధి అధికారి లత, డి సి ఓ పద్మజ,వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, మైనార్టీ వెల్ఫేర్ అధికారి జగదీశ్ రెడ్డి, డిఎం మార్కెటింగ్ శర్మ, కలెక్టరేట్ ఏవో సుదర్శన్ రెడ్డి, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.




## స్లాట్ బుకింగ్ విధానం రద్దు చేయాలి

- పాత విధానమే ముద్దు కొత్త విధానం వద్దు
- సూర్యాపేట దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్షులు తన్వీర్ హుస్సేన్.

సూర్యాపేట,విశాలభారతి: ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన స్లాట్ బుకింగ్ విధానాన్ని తొలగించి పాత పద్ధతి ద్వారానే రిజిస్ట్రేషన్లు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూర్యాపేట దస్తావేజు సంఘం అధ్యక్షులు తన్వీర్ హుస్సేన్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ధర్నా నిర్వహించి మాట్లాడారు. గత ప్రభుత్వంలో స్లాట్ బుక్ విధానాన్ని రద్దు చేసిందని మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ విధానాన్ని అమలు చేయడం వలన కొన్ని వేల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. స్లాట్ విధానంతో రానున్న రోజుల్లో డాక్యుమెంట్ రైటర్స్ జీవన ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. దీంతో వినియోగదారులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మా బాధలు పట్టించుకోవాలని తెలిపారు. స్లాట్ బుకింగ్ విధానానికి వ్యతిరేకంగా దస్తావేజు లేఖర్లు పెన్ డౌన్ బంద్ పాటించడం జరుగుతుందన్నారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ గుడుగుంట్ల అంబేద్కర్ కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు ఆకునూరి మురళీ మనోహర్ రావు, కందిమల్ల మధుసూదన్, గౌరవ సలహాదారులు ఎండి గౌస్ ఖాన్, రవీందర్ రావు, గట్టు మహేందర్, వీర్లపాటి వెంకన్న, మారోజు విక్రమ్ కుమార్, చెరుకు శ్రీనివాస్, కొల్లూరు సోమయ్య, వినయ్ కుమార్, నజీర్, పసుపులేటి సతీష్, రజినీకాంత్, సాయి, విక్రమ్, నజీర్ బాషా, ఉపేంద్రాచారి, జానయ్య, ప్రతాప్, ఉపేందర్, వెంకన్న, చైతన్య, సందీప్, నరేష్, హరీష్, మహేష్, ఉమారాణి, మదీన, వర్రే శివ తదితరులు పాల్గొన్నారు.




## పోషకాహారంతోనే ఆరోగ్యం

- ఎంసి చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి

తుంగతుర్తి, విశాలభారతి: పౌష్టికాహారం తోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి అన్నారు. సోమవారం కొత్తగూడెం గ్రామంలోని రైతు వేదిక ప్రాగణంలో జరిగిన పోషణ అభియాన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషకార లోపం వల్ల పిల్లల్లో అనేక రుగ్మతలకు గురవుతున్నారని తెలిపారు. అంగన్వాడి సెంటర్ లో బాలింతలు, గర్భిణీ స్త్రీలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తారని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో MRO, MPDO సిడిపిఓ శ్రీజ, మండల వైద్యాధికారిణి,అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



## పౌష్టిక ఆహార లోపం లేకుండా చూడాలి

మునుగోడు, విశాలభారతి: మండలంలోని కిష్టాపురం ఇప్పర్తి గ్రామాలలో ఐసిడిఎస్ సంయుక్తంగా పోషణ్ అభియాన్ పేరుతో తెలంగాణ ప్రభుత్వం ఏప్రిల్ 8 నుండి 22వ తారీకు వరకు పోషణ పక్షం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కొరటికల్ సెక్టర్ లోని కిష్టాపురం ఇప్పర్తి గ్రామాలలలో పోషణ్ పక్షం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ లావణ్య కుమారి మాట్లాడుతూ ప్రతి గర్భిణీ స్త్రీ అంగన్వాడీ కేంద్రంలో పేరు నమోదు చేసుకొని పౌష్టిక ఆహార లోపం లేకుండా చూసుకోవాలని బిడ్డ ఆరోగ్యంగా ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు. గర్భిణీలకు పౌష్టికాహారం ఐరన్ కాలుష్యం టాబ్లెట్స్ క్రమం తప్పకుండా తీసుకొని ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఏసిడిపిఓ వెంకటమ్మ సూపర్వైజర్ నాగమణి అంగన్వాడి టీచర్లు మంజుల సుజాత శంకరమ్మ ధనలక్ష్మి ఆశా కార్యకర్తలు కమల ధనలక్ష్మి గర్భిణీ స్త్రీలు తదితరులు పాల్గొన్నారు

## cinema updates



## కేజీఎఫ్ 3కి ఇంకా టైమ్ కావాలా?

`పుష్ప 3` తరువాత ఇండియా వైడ్‌గా ఆసక్తిగా ఎదురు చూస్తున్న సీక్వెల్ `కేజీఎఫ్ చాప్టర్ 3`. `కేజీఎఫ్` సిరీస్‌లో భాగంగా రానున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ కోసం గత కొంత కాలంగా చర్చ జరుగుతోంది. ఎప్పటికి ఈ మూవీ థియేటర్లలోకి వస్తుందా? రాఖీభాయ్ విళయతాండవ ఎలా ఉండనుందా? అని యష్ అభిమానులే కాకుండా సినీ లవర్స్, మేకర్స్, ట్రేడ్ ఎనలిస్ట్‌లు అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే ఈ ప్రాజెక్ట్ థియేటర్లలోకి రావడానికి చాలా సమయం పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. కన్నడ రాకింగ్ స్టార్ యష్ నటించిన `కేజీఎఫ్ చాప్టర్ 1` కన్నడతో పాటు మగతా దక్షిణాది భాషల్లోనూ, హిందీలోనూ ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలై సంచలనం సృష్టించింది. హాలీవుడ్ స్థాయి యాక్షన్ డ్రామాని కళ్లకు కట్టినట్టు చూపించడం, ఎవరూ ఊహించని నేపథ్యంలో సినిమా రావడంతో కన్నడతో పాటు దేశ వ్యాప్తంగా ప్రేక్షకులు ఈ సినిమాకు బ్రహ్మరథం పట్టారు. కోవిడ్‌కు ముందు విడుదలై ఇండియన్ బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టించింది. రూ.80 కోట్లతో నిర్మించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద వరల్డ్ వైడ్‌గా ఎవరూ ఊహించని విధంగా రూ.250 కోట్ల మేర వసూళ్లని రాబట్టింది. ఈ సినిమా రిలీజ్ వరకు యష్‌ంటే ఎవరో ఎవరికీ తెలియదు. కన్నడలో తప్ప ఇతర దక్షిణాది భాషల్లో యష్ తెలియదు. అయినా సరే ప్రశాంత్ నీల్ చేసిన మ్యాజిక్ కారణంగా యష్ ఒక్కసారిగా దేశ వ్యాప్తంగా క్రేజీ స్టార్ల జాబితాలో నిలిచాడు. ఫస్ట్ పార్ట్ కారణంగా సెకండ్ పార్ట్‌పై భారీ క్రేజ్ ఏర్పడటంతో దీని బిజినెస్ రికార్డు స్థాయిలో జరిగింది. అంతే కాకుండా రూ.100 కోట్లతో నిర్మిస్తే ఏకంగా రూ.1250 కోట్లు రాబట్టి ట్రేడ్ పండితుల్ని ఆశ్చర్యానికి గురి చేసింది. దీంతో పార్ట్ 3పై అంచనాలు తారా స్థాయికి చేరుకున్నాయి. రాఖీ భాయ్ కోసం అమెరికా సీఐఏతో పాటు 16 దేశాలు వెతుకుతున్నాయని పార్ట్ 2 ఎండింగ్‌లో హింట్ ఇవ్వడంతో `కేజీఎఫ్ చాప్టర్ 3`పై అంచనాలు తారా స్థాయికి చేరుకున్నాయి. బాలీవుడ్ డబ్బింగ్ హక్కుల కోసం భారీ స్థాయిలోక్రేజీ ప్రొడ్యూసర్స్ పోటీపడుతున్నారంటే కేజీఎఫ్ చాప్టర్ 3 క్రేజ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కడానికి, థియేటర్లలోకి రావడానికి చాలా సమయం పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది.కారణం ప్రశాంత్ నీల్ రెండు ప్రాజెక్ట్ (డ్రాగన్, సలార్ 2)లని పూర్తి చేసే పనిలో ఉండటం, యష్ కూడా `టాక్సిక్`, `రామాయణ` చిత్రాలతో బిజీగా ఉండటంతో `కేజీఎఫ్ చాప్టర్ 3` మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉందని స్పష్టమవుతోంది. ఈ ఇద్దరు తాము అంగీకరించిన రెండు ప్రాజెక్టలని పూర్తి చేసిన తరువాతే `కేజీఎఫ్ 3`నిఒ పట్టాలెక్కిస్తారని ఇన్ సైడ్ టాక్. అంటే `కేజీఎఫ్ 3` కోసం 2027 వరకు వేచి చూడాల్సిందే అనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. మరి దీనిపై హోంబలే ఫిల్మ్స్ ఎలా స్పందిస్తుందో చూడాలి.



## శృతి అప్పుడే మొదలెట్టేసిందిగా!

సుమారు రెండేళ్ల పాటూ వెండితెరకు దూరంగా ఉన్న శృతి హాసన్ ఇప్పుడు తిరిగి కంబ్యాక్ ఇవ్వాలని చూస్తోంది. ఆమె అభిమానులు కూడా ఆమెకు వెల్‌కమ్ చెప్పేందుకు రెడీగా ఉన్నారు. 2023లో సలార్: పార్ట్1 సీజ్‌ఫైర్ లో ఆఖరిగా కనిపించిన శృతి హాసన్, ఇప్పుడు రెండేళ్ల తర్వాత కూలీ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా నటిస్తున్న కూలీ సినిమాలో శృతి హాసన్ హీరోయిన్ గా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకు లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో వహిస్తున్నాడు. పాన్ ఇండియా ప్రాజెక్టుగా రూపొందుతున్న ఈ సినిమా ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ ను జరుపుకుంటుంది. అయితే కూలీ సినిమాకు విపరీతమైన బజ్ నెలకొంది. దానికి కారణం లేకపోలేదు. రజినీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో నాగార్జున, ఉపేంద్ర, అమీర్ ఖాన్ లాంటి భారీ తారాగణం కీలక పాత్రలు చేస్తుండగా శృతి హాసన్ హీరోయిన్ గా నటిస్తోంది. సత్యరాజ్ సపోర్టింగ్ రోల్ లో నటిస్తున్నారు. పూజా హెగ్డే స్పెషల్ సాంగ్ లో సందడి చేయనుంది. ఈ నేపథ్యంలోనే కూలీపై విపరీతమైన అంచనాలున్నాయి. ఆగస్ట్ 14న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్నట్టు మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ కూడా చేశారు. ఇదిలా ఉంటే శృతి హాసన్ కూలీ సినిమాలో తన పాత్రకు సంబంధించిన డబ్బింగ్ ను చెప్తున్నట్టు సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. శృతి చేసిన ఈ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతుండగా, కూలీలో శృతి ఎలాంటి క్యారెక్టర్ లో కనిపిస్తుందో చూడ్డానికి ఆమె ఫ్యాన్స్ ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు. అయితే కూలీలో శృతి క్యారెక్టర్ చాలా స్పెషల్ గా ఉండనుందని, కొంత కాలం పాటూ ఆ పాత్ర గుర్తుండిపోతుందని ఇప్పటికే చిత్ర యూనిట్ పలుసార్లు తెలిపింది. ఇప్పటికే తెలుగు, తమిళ, హిందీ భాషల్లో తనదైన ముద్ర వేసిన శృతి హాసన్ సినిమాలతో పాటూ సింగింగ్ పరంగా పలు ఇంటర్నేషనల్ ప్రాజెక్టుల్లో భాగమవుతూ అందులోనూ తన సత్తా చాటుతోంది.



## రెసిల్ మేనియాలో రానా..

WWE రెసిల్ మేనియా గురించి అందరికీ తెలిసిందే. రెజ్లింగ్ లో అదే పెద్ద ఈవెంట్ కాగా.. ఏడాదికి ఒకసారి జరుగుతోంది. ఇప్పుడు రెజిల్ మేనియా 41వ ఈవెంట్ కు టాలీవుడ్ యంగ్ హీరో కమ్ ప్రొడ్యూసర్ రానా హాజరయ్యారు. అందుకు సంబంధించిన ఫోటోలతో పాటు వీడియోలు.. ఇప్పుడు సోషల్ మీడియాలో ఫుల్ గా వైరల్ అవుతున్నాయి. అయితే రెజిల్ మేనియాలో పాల్గొన్న తొలి ఇండియన్ సినీ సెలబ్రిటీగా రానా దగ్గుబాటి ఘనత సాధించారు. లాస్ వెగాస్ లో జరిగిన రెజ్లింగ్ ఈవెంట్ లో రానా పాల్గొని.. WWE అభిమానులను ఉత్సాహపరచడమే కాకుండా ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో అందరి దృష్టిని ఆకర్షించారు. స్టైలిష్ వైట్ అండ్ బ్లాక్ ఔట్ ఫిట్ లో రానా కనిపించారు. ఈవెంట్ జరుగుతున్న సమయంలో హోస్ట్.. రానా గురించి మాట్లాడారు. రానా రెసిల్ మేనియాలో ఉన్నారు.. రానా నాయుడు నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ అవుతున్నారు అని హోస్ట్ తెలిపారు. అయితే రెసిల్ మేనియా 41వ ఈవెంట్ కు హాజరవ్వడం చాలా మంచి ఎక్స్పీరియన్స్ అని రానా వెల్లడించారు. WWE మనందరి బాల్యంలో భాగమని అన్నారు. ఇప్పుడు WWEని ప్రత్యక్షంగా చూడడం.. వరల్డ్ స్టేజ్ పై భారత్ కు ప్రాతినిధ్యం కల్పించడం.. అదే సమయంలో నెట్ ఫ్లిక్స్ లో WWE, రానా నాయుడు స్ట్రీమింగ్ అవ్వడం.. ఇది ఫుల్ ఫిల్ ఫీలింగ్ అని తెలిపారు రానా. అయితే టాలీవుడ్ హల్క్ కు రెజ్లింగ్ అంటే చాలా ఇష్టమట. ఇప్పటికే ఆయన పలువురు రెజ్లర్లను కూడా మీట్ అయ్యారని వినికిడి. ఇక రానా దగ్గుబాటి కెరీర్ విషయానికొస్తే.. ఆయన చివరిసారిగా హీరోగా విరాట పర్వం మూవీ చేశారు. ఆ తర్వాత లీడ్ రోల్ లో మరో సినిమాతో సందడి చేయలేదు. రీసెంట్ గా కోలీవుడ్ సూపర్ స్టార్ రజనీ కాంత్ వేట్టయాన్ మూవీలో కనిపించారు. గత ఏడాది దసరా కానుకగా రిలీజ్ అయిన ఆ సినిమాలో తన యాక్టింగ్ తో మెప్పించారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.